# ఇంటర్ విద్యార్థులకు అలర్ట్

తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల నిర్వహణలో కీలక సంస్కరణ చేపట్టింది. ఇప్పటివరకు అమలులో ఉన్న బ్లాంక్ బార్ కోడ్ (బార్ కోడ్ లేని OMR షీట్లు) విధానానికి పూర్తిగా ముగింపు పలికింది. ఇకపై జరగబోయే ఇంటర్ పరీక్షలను ప్రింటెడ్ బార్ కోడ్ షీట్లతో నిర్వహించనుంది. ఈ నిర్ణయం ప్రధానంగా పరీక్షా ఫలితాల ప్రక్రియలో జరిగే ఆలస్యాన్ని నివారించడానికి, అలాగే మానవ తప్పిదాల ను తగ్గించడానికి దోహదపడుతుంది. బ్లాంక్ బార్ కోడ్ విధానంలో విద్యార్థులు తమ వివరాలను, కోడ్‌లను చేతితో నింపేవారు. ఈ ప్రక్రియలో పొరపాట్లు జరగడం, వాటిని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పడుతుండటం వలన ఫలితాలు ఆలస్యమయ్యేవి. ఈ కొత్త విధానం ద్వారా ప్రక్రియ వేగవంతం అవుతుందని బోర్డు ఆశాభావం వ్యక్తం చేస్తోంది.ప్రింటెడ్ బార్ కోడ్ షీట్లు అమలులోకి రావడంతో, పరీక్షా విధానంలో కొన్ని ముఖ్యమైన మార్పులు రానున్నాయి. ఈ కొత్త OMR షీట్లపై విద్యార్థి పేరు, రిజిస్ట్రేషన్ నంబర్, మీడియం, సెకండ్ లాంగ్వేజ్ వంటి వివరాలు ముందుగానే ముద్రించి వస్తాయి.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :236 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 28-11-2025 | పేజీలు:4 వెల: 2.00


## స్కైరూట్ ఏరోస్పేస్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను ప్రారంభించి.. విక్రమ్-1 రాకెట్‌ని ఆవిష్కరించిన ప్రధాని మోదీ



హైదరాబాద్: హైదరాబాద్ రావిర్యాలలోని స్కైరూట్ ఏరోస్పేస్ ఇన్ఫినిటీ క్యాంపస్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి ప్రైవేటు కమర్షియల్ రాకెట్ విక్రమ్-1ను ఆవిష్కరించారు. స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్ దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ సంస్థ కావడం విశేషం. ఈ సందర్భంగా స్కైరూట్ బృందానికి ప్రధాని అభినందనలు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతీయ అంతరిక్షంలో ఇది మైలురాయిగా పేర్కొన్నారు. భారత యువశక్తి నైపుణ్యానికి స్కైరూట్ గొప్ప ప్రతీక అని, భారత అంతరిక్ష రంగం భవిష్యత్తులో మరిన్ని ఘనతలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయం భారత యువశక్తికి స్ఫూర్తినిస్తుందని.. సైకిల్‌పై రాకెట్ మోసుకెళ్లే స్థితి నుంచి మన ప్రస్థానం ప్రారంభమైందన్నారు. వ్యవసాయం, వాతావరణ అంచనాల్లో మరింత విజ్ఞానం సాధించాలని పిలుపునిచ్చారు. స్పేస్ సెక్టార్‌లో కో ఆపరేటివ్, ఎకో సిస్టమ్‌ను తీసుకువచ్చామని.. జన్‌జీ అనుకున్నది సాధించేలా కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు.అంతరిక్ష రంగంలో కేంద్రం ఇస్తున్న మద్దతు వల్లే స్టార్టప్‌లు వస్తున్నాయని, ప్రైవేటు రంగంలోనూ అంతరిక్ష సంస్థలు పుట్టుకొస్తున్నాయన్నారు. జన్‌జీ ఇంజినీర్లు, డిజైనర్లు, కోడర్స్, సైంటిస్టులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గ్లోబల్ శాటిలైట్ వ్యవస్థలో భారత్ లీడర్‌గా మారనుందన్నారు. స్కైరూట్ లాంచింగ్‌తో యువతలో నమ్మకం పెరుగుతుందన్న ఆయన.. భారతీయ స్పేస్ సెక్టార్‌లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. ప్రపంచంలో చిన్న శాటిలైట్లకు డిమాండ్ పెరిగిందని.. రాబోయే కాలంలో శాటిలైట్ ఎకానమీ భారీగా పెరుగుతుందన్నారు. ప్రపంచంలోని పలు దేశాల్లో మాత్రమే అంతరిక్ష పరిజ్ఞానం ఉందని.. భారత శాటిలైట్లు తక్కువ ఖర్చుతో నమ్మదగినవని చెప్పారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సహా పలువురు హాజరయ్యారు.విక్రమ్-1 అనేది ఓ సాంకేతిక అద్భుతం. ఇది ఎర్త్ లో ఆర్బిట్‌కి దాదాపు 300 కిలోల పేలోడ్స్‌ను మోసుకు వెళ్లేలా రూపొందించారు. కార్బన్ ఫైబర్ బాడీతో తీర్చిదిద్దారు. విక్రమ్ సిరీస్‌కు ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్ వ్యవస్థాపకుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ పేరును పెట్టారు. భారత్ అవసరాలకు మాత్రమే కాకుండా విదేశాలకు చెందిన శాటిలైట్లను సైతం నింగిలోకి మోసుకువెళ్లే లక్ష్యంతో ఈ రాకెట్‌ను అభివృద్ధి చేశారు. విక్రమ్-1 రాకెట్‌కు బహుళ శాటిలైట్లను ఒకేసారి కక్ష్యలోకి ప్రవేశపెట్టే సామర్థ్యం ఉంది. ఏ ప్రయోగ ప్రదేశం నుంచి అయినా 24 గంటల్లో దీన్ని సమీకరించి ప్రయోగించవచ్చని కంపెనీ స్పష్టం చేసింది. విక్రమ్ ప్రపంచ ఉపగ్రహ ప్రయోగ పర్యావరణ వ్యవస్థలో దేశాన్ని భవిష్యత్ అగ్రస్థానంలో నిలుపుతుంది. ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు, ఐఐటీ పూర్వ విద్యార్థులు పవన్ కుమార్ చందన, నాగ భరత్ ఢాకా స్థాపించిన స్కైరూట్ 2022లో భారతదేశపు తొలి ప్రైవేట్ సబ్ ఆర్బిటల్ రాకెట్ ప్రయోగం విక్రమ్-ఎస్‌తో చరిత్ర సృష్టించారు.

## భద్రతా ప్రమాణాల్లో అగ్రగామి తెలంగాణ ఆర్‌అండ్ బి శాఖ



హైదరాబాద్ : నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాల అమలులో విశేష ప్రతిభకనబరుస్తూ తెలంగాణ రోడ్లు-భవనాల శాఖ జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రకటించిన జాతీయ భద్రతా అవార్డును రాష్ట్ర ఆర్‌అండ్బి శాఖ ఎంపికైంది. వరంగల్ రంగంపేటలో నిర్మాణం జరుగుతున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో భద్రతా ప్రమాణాలు, పర్యవేక్షణ, కార్మిక భద్రత చర్యలు సమర్థంగా అమలైనందుకు ఈ అవార్డు లభించింది.

ఎన్ఎస్సిఐ పరిశీలనలో తెలంగాణ ఆర్ అండ్ బి శాఖ పనితీరు

ఎన్ఎస్సిఐ పరిశీలనలో భాగంగా ప్రాజెక్టు అమలు విధానం, భద్రతా ప్రోటోకాల్లు, మానిటరింగ్ సిస్టమ్, ప్రమాద నివారణ చర్యలు వంటి అంశాలను విశ్లేషించగా, రాష్ట్రం పాటించిన విధానం ఆదర్శంగా నిలిచిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాల్లో భద్రత అత్యంత ప్రాధాన్యం పొందుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రాజెక్టులు వేగంగా పూర్తవడంతో పాటు నాణ్యత, భద్రత, స్థిరత్వం కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్ అండ్ బి పరిధిలో సుమారు ఒక కోటి చదరపు అడుగుల ప్రభుత్వ నిర్మాణాలు జరిగితే, ప్రజా ప్రభుత్వం ఏర్పాటై నేను ఆర్ అండ్ బి శాఖ మంత్రి అయిన ఈ రెండు సంవత్సరాల్లోనే దాదాపుగా అదే స్థాయిలో కోటి చదరపు అడుగులు నిర్మాణాలు జరుగుతుండడం, ఆర్ అండ్బి శాఖ పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు.

## బీసీ రిజర్వేషన్లు ఒక పొలిటికల్ డ్రామా.. ఎంపీ అరవింద్ షాకింగ్ కామెంట్స్

నిజామాబాద్, బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ( కీలక వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్లు ఒక పొలిటికల్ డ్రామా అని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఇవాళ(గురువారం) నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో ఎంపీ పాల్గొన్నారు. అనంతరం మీడియాతో ఎంపీ అరవింద్ మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీలని పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలు అమలు చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే తెలంగాణలో సర్పంచ్ ఎన్నికలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోందని విమర్శించారు. పావలా వడ్డీకే కేంద్రం నిధులు ఇస్తోందని చెప్పుకొచ్చారు. కేంద్ర నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎందుకు చేయడం లేదని నిలదీశారు. కేంద్ర నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతున్నాయని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పదని విమర్శలు చేశారు. రైల్వే పనులకు నిధులు విడుదల చేసిన తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకి ధన్యవాదాలు



తెలిపారు. రైల్వే పనులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిధులు ఇవ్వకుంటే నిరాహార దీక్ష చేస్తానని తాను ప్రకటించానని గుర్తుచేశారు. నిజామాబాద్ జిల్లాలో 10 ఆర్వోబీలు పూర్తి చేయాలనేది తన టార్గెట్ అని ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు.. బీజేపీ హై కమాండ్‌కు రాజాసింగ్ కీలక అభ్యర్థన



హైదరాబాద్, నవంబరు27 : స్థానిక సంస్థల ఎన్నికలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ కోసం కష్టపడి పనిచేసిన నేతలకు ఈ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు బీజేపీ హై కమాండ్‌ను అభ్యర్థించారు. ఇవాళ(గురువారం) ఓ ప్రకటన విడుదల చేశారు రాజాసింగ్. ఈరోజు భారతీయ జనతా పార్టీలోని కొంతమంది ప్రముఖ నాయకులు తన వ్యక్తికి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని గుర్తుచేశారు.ఇలాంటి వారికి టికెట్ ఎందుకు ఇస్తున్నారు..? అని ప్రశ్నించారు.

బీజేపీలో ఇలాంటి వాతావరణం పెరుగుతోందని... ఇది పార్టీకి హాని కలిగిస్తోందని హెచ్చరించారు. కమలం పార్టీలో పాత కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలని సూచించారు. ఆర్థికంగా బలంగా లేని కార్యకర్తలను ఎన్నికల్లో నిలబెట్టి వారి విజయం కోసం పార్టీ పెట్టుబడి పెట్టాలని ఆకాంక్షించారు. బీజేపీలో సీనియర్ నాయకులు ఇతర పార్టీలతో రాజీపడే విధానాన్ని వదిలివేసి, పార్టీని బలోపేతం చేయడంలో ముందుకు సాగాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఎన్ని ఎక్కువ సీట్లు గెలిస్తే, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అంత మంచి ఫలితాలు వస్తాయని రాజాసింగ్ పేర్కొన్నారు.

## 2015 గ్రూప్-2 ర్యాంకర్స్‌కు ఊరట..

హైదరాబాద్, 2015 గ్రూప్-2 ర్యాంకర్లకు తెలంగాణ హైకోర్టు సీజే ధర్మాసనం ఊరటనిచ్చింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. ఈ మేరకు గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, 2015-16లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షను ఇటీవల న్యాయమూర్తి నగేష్ భీమపాక నేతృత్వంలోని హైకోర్టు సింగిల్ బెంచ్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరీక్షల సమయంలో హైకోర్టు ఆదేశాలను టీజీపీఎస్సీ ఉల్లంఘించిందని పేర్కొంది. టీజీపీఎస్సీ పరిధి దాటి వ్యవహరించిందని న్యాయమూర్తి.. తిరిగి మూల్యాంకనం చేయాలని బోర్డును ఆదేశించారు. ఆ తర్వాత మళ్లీ అర్హుల జాబితాను ప్రకటించాలని చెప్పారు. ఎనిమిది వారాల్లోగా పునః మూల్యాంకరనం జరుగాలని.. జాబితా ప్రకటన ప్రక్రియ ముగించాలని సూచించారు. అయితే, సింగిల్ జడ్జి తీర్పును సవాల్ చేస్తూ పలువురు సీజే ధర్మాసనాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు ఇరువర్గాల వాదనలు విన్న సీజే ధర్మాసనం సింగిల్ జడ్జి ఆదేశాలను పక్కన పెట్టింది.

అసలేం జరిగిందంటే..

పదేళ్ల కిందట అంటే.. 2015-16లో 439 పోస్టులకు గ్రూప్ 2 పరీక్ష నిర్వహించిన టీజీపీఎస్సీ.. 2016 నవంబర్‌లో రాత పరీక్షలు నిర్వహించింది. అయితే.. ఈ పరీక్షలో కొందరు వైట్‌నర్ ఉపయోగించారంటూ పలువురు కొందరు అభ్యంతరం తెలుపుతూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే,



టీజీపీఎస్సీ వెనక్కి తగ్గకుండా.. 2019లో నియామకాలు చేపట్టింది. నియామకాలపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలువురు హైకోర్టును ఆశ్రయించారు. వైట్‌నర్, దిద్దుబాటు ఉన్న ప్రశ్నప్రత్రాలను మూల్యాంకనం చేయడంపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ అసహనం వ్యక్తం చేసింది. అలానే ట్యాంపరింగ్ జరిగినట్టు తెలిసినా సరే మూల్యంకనం చేయడం చట్టవిరుద్ధమని న్యాయమూర్తి అభిప్రాఆయపడ్డారు. సాంకేతిక కమిటీ సూచన ప్రకారం అప్పటి ప్రశ్నపత్రాలను తిరిగి మూల్యంకనం చేయాలని ఆదేశాలు బెంచ్ ఆదేశించింది.

## నర్సాపూర్‌లో కాంగ్రెస్‌కు భారీ షాక్.. హరీశ రావు సమక్షంలో బీఆర్ఎస్ గూటికి కీలక నేతలు



సిద్దిపేట : మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధిని కాంక్షిస్తూ నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు కీలక కాంగ్రెస్ నాయకులు గులాబీ గూటికి చేరారు. స్థానిక ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో, మాజీ మంత్రి హరీశ్ రావుసమక్షంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన అంజనేయులు (మాజీ జెడ్పీ టీసీ), శరత్ చంద్ర, మల్లేశం, నర్సింహారెడ్డి, అరవింద్ బాబు ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి హరీష్ రావు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ అంటేనే నయవంచన అని, ప్రతి వర్గాన్ని మోసం చేసిన చరిత్ర ఆ పార్టీదని ఆరోపించారు. గత రెండేళ్లుగా కాంగ్రెస్ పాలనలో ఏ ఒక్క ప్రాంతం అభివృ ద్ధికి నోచుకోలేదని, ఏ ఒక్కరికీ మేలు జరగలేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, నేడు కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో పయనిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు కేవలం ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికేనని ఆరోపించారు.

కరెంటు నుంచి కాంటా దాకా..

వృద్ధులకు రూ.4000 పెన్షన్, మహిళలకు మహాలక్ష్మి పథకం, విద్యార్థులకు విద్యా భరోసా, నిరుద్యోగులకు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు, ఉద్యోగులకు డీఏలు, పీఆర్సీలు.. ఇలా అన్ని వర్గాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో కరెంటు నుంచి కాంటా దాకా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లోవోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. కొనుగోలు కేంద్రాలు సక్రమంగా లేక, ధాన్యం దళారుల పాలవుతోందని మండిపడ్డారు.రైతుబంధు, రుణమాఫీ, పంటల బీమా, బోనస్ వంటి పథకాలన్నీ అటకెక్కాయని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసాలను ఎక్కడికక్కడ ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచిం చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండాయేనని, కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తూ అందరూ కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలని హరీశ్ రావ పిలుపునిచ్చారు.

## రాజకీయ లబ్ధి కోసమే లడ్డూల అంశంపై చంద్రబాబు ఆరోపణలు



తిరుమల: తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో తప్పుడు ప్రచారానికి ముగింపు పలకాలని తెలుగుదేశం ప్రభుత్వానికి టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సూచించారు. న్యూఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుమల ప్రసాదంపై తరుచూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. ఈ విషయంలో వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. శ్రీవారి లడ్డూ విషయంలో తాము ఎలాంటి తప్పు చేయలేదన్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు వినియోగించారని ఆరోపించారని.. సిట్ ఇప్పటి వరకు ఈ విషయంలో స్పష్టత ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. ప్రసాదం టెస్ట్ విషయంలో పటిష్టమైన వ్యవస్థ ఉంటే కల్తీ ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు.తన హయాంలో నాలుగు నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించామన్న ఆయన.. తిరుమల తిరుపతి దేవస్థానంలో 15 సంవత్సరాలుగా ఏం జరుగుతుందో తెలుసుకొని మాట్లాడాలన్నారు. తమ హయాంలోనే తిరుమలలో ప్లాస్టిక్ వినియోగించుకుండా నిషేధం విధించామన్నారు. లడ్డూల వ్యవహారంలో ఏపీ సీఎం చంద్రబాబు, టీటీడీ ఈవో ఇద్దరూ పరస్పర విరుద్ధ ఆరోపణలు చేశారని.. దీనిపై సైతం సిట్ క్లారిటీ ఇవ్వలేదని గుర్తు చేశారు. శ్రీవారి లడ్డూలపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని సుబ్బారెడ్డి విమర్శించారు. ఎవరిపై సీఎం చంద్రబాబు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని నిలదీశారు. 2019-2024 వరకు తయారైన లడ్డూలన్నీ కల్తీ చేసినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కేవలం రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రచారం చేస్తూ శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు.చంద్రబాబు ప్రభుత్వ హయాంలో భక్తుల కానుకలను ప్రైవేట్ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన అంశాన్ని మాజీ చైర్మన్ గుర్తు చేశారు. టీడీపీ పదవీకాలంలో జరిపిన నెయ్యి కొనుగోళ్లపై సైతం విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. 2014 నుంచి 2024 వరకు చంద్రబాబు హయాంలో కల్తీ నెయ్యి ట్యాంకర్లను ఎన్నింటిని రిజెక్ట్ చేశారో చెప్పాలని సవాల్ చేశారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని.. లై డిటెక్టర్ పరీక్షల, సత్య శోధన పరీక్షకు సైతం సిద్ధంగా ఉన్నానన్నారు. తాను ఏ అవినీతికి పాల్పడలేదన్నారు. యెస్ బ్యాంకులో టీటీడీ డిపాజిట్లు, శ్రీనివాస సేతు విషయంలోనూ దర్యాప్తు చేయాలన్నారు. అప్పన్న తన పీఏ కాదని.. ఆయనతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఎంపీ వేమిరెడ్డి వద్ద పని చేశారని వివరించారు.

## తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్.. నామినేషన్ల పర్వం షురూ..!

హైదరాబాద్,తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్ర ఎన్నికల అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నుంచి ఈ నెల 29 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామపత్రాలను దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 30న నామినేషన్లను పరిశీలిస్తారు. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచిన అభ్యర్థులతో కూడిన తుది జాబితాను ప్రకటిస్తారు. డిసెంబర్ 3 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది.తొలిదశలో 4,236 గ్రామాలకు ఎన్నికలు జరుగనుండగా.. 37,450 వార్డుల్లో పోలింగ్ డిసెంబర్ 3న పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు. డిసెంబర్ 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి వార్డు సభ్యులు, సర్పంచ్ ఫలితాలను వెల్లడించనున్నారు. అదే సమయంలో తొలి విడతలో ఎన్నికలు జరిగే 189




మండలాల్లోని 4,236 గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించనున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో గ్రామాల్లో సందడి నెలకొన్నది.

## సంపాదకీయం

శుక్రవారం 28-11-2025

# రాజకీయ రణక్షేత్రాలుగా గ్రామాలు !

గ్రామాల్లో మళ్లీ సందడి మొదలయ్యింది. పంచాయతీ ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ హడావిడి జోరందుకుంది. పార్టీ రహితంగానే ఎన్నికలు జరుగనున్నప్పటికీ అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే సర్పంచ్ పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో గ్రామాలు ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా పల్లె పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదలైంది. మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించగా, మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. మూడు దశల్లో నిర్వహించే గ్రామ పంచాయతీల పేర్లను యంత్రాంగం ఖరారు చేసింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. కాగా, దాదాపు 20 నెలల తర్వాత ఎన్నికలు జరుగుతున్నాయి. ఇవి పార్టీ రహితమే అయినా, పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అయితే ఇప్పటికే ఓసారి సర్కారు చేసిన హడావుడిని నమ్మి ఆశావహులు, భారీగా ఖర్చు చేసి షెడ్యూల్ రద్దు కావడంతో నిరాశ చెందారు. ఇప్పుడు మరోసారి షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. కోర్టులో కేసు ఉందని తెలిసినా సర్కారు చేసిన హడావుడిని నమ్మిన ఆశావహులు, ఇప్పటికే తమ ప్రయత్నాల్లో మునిగి తేలారు. ఆ మేరకు భారీగా ఖర్చు చేశారు. నిజానికి ఎన్నికల నిబంధనల ప్రకారం చూస్తే.. సర్పంచ్, వార్డు మెంబర్ల విషయానికొస్తే ఐదు వేలకు పైగా జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ బరిలో ఉండే అభ్యర్థి 2.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 50వేలు.. అలాగే ఐదు వేల లోపు జనాభా ఉంటే అక్కడ సర్పంచ్ అభ్యర్థి 1.5 లక్షలు, వార్డుమెంబర్ అభ్యర్థి 30వేలలోపు ఖర్చు చేయాలి. అయితే ఆచరణలో జరిగే ఖర్చులకు ఎన్నికల సంఘం పెట్టిన నిబంధనలకు ఎప్పుడూ పొంతన ఉండదన్న విషయం తెలిసిందే. అయితే సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గుచూపుతారు. కానీ, గతంలోనే షెడ్యూల్ జారీచేయగా, అప్పుడు చాలా మంది అభ్యర్థులు భారీగా ఖర్చు పెట్టారు. తీరా ఆ షెడ్యూల్ రద్దుకావడంతో తీవ్ర నిరాశ చెందారు. ఇక ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేపనున్నారు. ఇది లా ఉంటే పల్లెల్లో పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ రహిత ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. గతంలో ఓ మారు నోటిఫికేషన్ విడుదల, రద్దు కావడంతో ఇప్పటికే సిద్ధంగా ఉన్న అభ్యర్థులు మళ్లీ పోటీకి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు మాత్రమే ఎన్నికలు జరుగనున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తరవాత నిర్వహించాలని నిర్ణయించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే ఎన్నికలు జరుగబోతున్నాయి. మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మూడు వారాల సమయంలోనే మొత్తం ప్రక్రియ ముగియనుండంతో గ్రామాలు కేంద్రంగా రాజకీయ పార్టీలు బలాబలాలకు రంగం సిద్ధం అయ్యింది. 27తో తొలి దశ ఎన్నికల ప్రక్రియ మొదలై డిసెంబర్ 17తో మూడో దశ పంచాయతీ ఎన్నికలు ముగుస్తాయి. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. అదికూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే పోలింగ్ జరగ నుండడంతో గ్రామాల్లో ఓట్ల వేటలో అభ్యర్థులు పడ్డారు. డిసెంబర్ 11న తొలిదశ, డిసెంబర్ 14న రెండో దశ, డిసెంబర్ 17న మూడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో నామినేషన్ల పర్వం కూడా వెంటనే మొదలయ్యింది. సర్పంచ్ ఎన్నికలకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇక మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల సంఘం నుంచి ఎన్నికల ప్రకటన ఉంటుందని తెలిసి హడావిడిగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిందని విపక్ష బిఆర్ఎస్ విమర్శలు చేస్తోంది. మరోవైపు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు కూడా పంపిణీ చేశారు. కొన్ని చోట్ల రుణాల పంపిణీ సంపూర్ణంగా అందివ్వలేదు. మొత్తానికి చీరల పంపిణీని ప్రభుత్వం పకడ్భందీగా చేపట్టినప్పటికీ క్షేత్ర స్థాయిలో మహిళా లోకం నుంచి స్పందన ఎలా ఉంటుందన్నది చూడాలి. సర్పంచ్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుండటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి నుంచి ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు.తొలి విడతలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. రెండో విడతలో పోటీ చేసే వారికి షెడ్యూల్ జారీ నుంచి మొదలు పెడితే అదనంగా నాలుగైదు రోజులు కలిసి వస్తోంది. తుది విడతలో పోటీ చేసే వారికి దాదాపుగా మూడు వారాల సమయం దక్కుతోంది. ప్రచారానికి అధిక సమయం దక్కడం ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా తుది విడత అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా గ్రామాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.

# ఒకే వరలో రెండు కత్తులు... ఇదేం 'పంచాయతీ'?





హైదరాబాద్,ఇప్పుడు తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవస్థ పరిస్థితి అలాగే ఉంది. పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నదన్న నేపథ్యంలో మన పంచాయతీ రాజ్ వ్యవస్థ గురించి సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. మన రాష్ట్రంలో ఉన్నంత గందరగోళంగా ఏ రాష్ట్ర పంచాయతీరాజ్ వ్యవస్థ లేదు. ఒకేవరలో రెండు కత్తులు ఇమడలేని విధంగా మన పంచాయతీరాజ్ వ్యవస్థలో ఒకే అధికార పరిధిలో రెండు పదవులు సృష్టించి అధికారులు, ప్రభుత్వాలు తమాషా చూస్తున్నారు తప్ప మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థలో అధికార విభజన సమస్యలు లేకుండా చూసేందుకు ఇష్టపడడం లేదు? ఉన్న లోపభూయిష్టమైన పంచాయతీ రాజ్ వ్యవస్థ స్వరూపాన్ని మూడంచెల అధికారస్థాయిగా వికేంద్రీకరణ చేయడానికి బదులు, నాలుగు అంచెలుగా అస్తవ్యస్త అధికార విభజన చేయడంతోపాటు, అధికార విభజనలో అస్పష్టతతో చోద్యం చూస్తున్నారు. ఒకే అధికార పరిధిలో రెండు పదవులు పెట్టి రాజకీయ సవతి పోరుకు తెరలేపడమేకాక, ఒకే అధికార పరిధిలో రెండు ఎన్నికలను జరిపి, ఎన్నికల పేరుతో ఎంతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. అదేమిటో పరిశీలన చేద్దాం. వాస్తవంగా గ్రామ సర్పంచ్, మండలం ప్రాదేశిక నియోజకవర్గం సభ్యుల (ఎంపిటిసి) అధికార పరిధి ఒక్కటే, అయితే, పదవులే వేర్వేరు. ఎన్నికలు మాత్రం రెండు పదవులకు జరగాలి. సర్పంచ్, ఎంపిటీసి ఇద్దరూ ఒకే మండల పరిషత్తులో సభ్యులుగా ఉండి ఆయా గ్రామాల నుండి ద్విప్రాతినిధ్యం వహించుతారు. ఎవరు సమావేశంలో సమస్య లేవనెత్తినా ఒక్కటే అంశం. ఇకపోతే మండల స్థాయిలో మండల పరిషత్తు అధ్యక్షుడు, జిల్లా ప్రాదేశిక నియోజికవర్గం సభ్యులది ఒకే అధికార పరిధి. అంతేకాదు ఒకే మండలం నుండి జిల్లా పరిషత్తులో రెండు ప్రాతినిధ్యాలు అవసరమా? అంతేకాదు, మండలంలో ఎంపిటిసి, జిల్లాలో జడ్‌పిటిసిలకు మండల పరిషత్ అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వరకే ప్రాధాన్యత ఉంటుంది. అటుతర్వాత వారి అధికారాలు తాలింపులో కరివేపాకు మాదిరే! ఇకపోతే గ్రామ స్థాయిలో సర్పంచ్, ఎంపిటిసి ఎన్నిక, మండలస్థాయిలో జెడ్‌పిటిసి, మండల పరిషత్తు ఎన్నికల వలన రెండు ఎన్నికల నిర్వాహణ ఖర్చుతోపాటు, ఐదేండ్ల పాటు ఎంపిటిసి, సర్పంచ్, జెడ్‌పిటిసిలకు నెల సరిగా ఇచ్చే గౌరవ వేతనం, సౌకర్యాలు కల్పనకు అవుతున్న ఖర్చు ప్రజలపైనే అదనపు భారం మోపుతున్నారు తప్ప నిక్కచ్చిగా మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్మాణం, ఎన్నికల పద్ధతి మార్పు చేసుకుంటే! ఈ అధికార విభజన గందరగోళం, ఎన్నికలు, గౌరవ వేతనం పేరుతో చేసే ఖర్చులు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఒకసారి మన మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థలో మార్పులను పరిశీలన చేసినట్లైతే మన పంచాయతీరాజ్ వ్యవస్థ ఇంత గందరగోళంగా ఎందుకు తయారైంది? అనే అంశం అవగతం అవుతుంది. మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1955లో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థకు రూపకల్పన చేసి, అధికార విభజన కూడా చేశారు. గ్రామ స్థాయిలో సర్పంచ్ ఎన్నికల ద్వారా ఎన్నిక అవుతారు. ఎన్నికైన సర్పంచ్‌లు బ్లాక్ అధ్యక్షుడును పరోక్ష పద్ధతిలో ఎన్నిక అవుతారు. ఈ బ్లాకు అధ్యక్షులు అందరూ కలిసి పరోక్ష ఎన్నిక ద్వారానే జిల్లా పరిషత్తు చైర్మన్‌ను ఎంపిక చేసుకునేవారు. అంటే గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ప్రత్యక్షంగా జరిగితే, పరోక్షంగా బ్లాకు, జిల్లాస్థాయి ఎన్నికలు అన్ని పూర్తి అయ్యేవి. అటు తర్వాత 1970 దశకంలో మాధ్యమిక వ్యవస్థ అయిన బ్లాకు స్థానంలో పంచాయతీ సమితి ఏర్పాటు చేశారు. ఇక 1977 నుండి 1987 మధ్య అనేక మార్పులు జరిగాయి. పంచాయతీ సమితి అధ్యక్షుడు, జిల్లా పరిషత్తు చైర్మన్ ఎన్నిక పరోక్ష ఎన్నిక నుండి ప్రజలే నేరుగా ఎన్నుకునే విధంగా ఎన్నికల విధానం మార్చారు. అటు తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్‌టిఆర్ అధికారం చేపట్టిన తర్వాత పంచాయతీ రాజ్, రెవెన్యూ వ్యవస్థ స్వరూపం మార్చివేశారు. పాలనా సౌలభ్యం పేరుతో పంచాయతీ సమితి వ్యవస్థను రద్దుచేసి మండలం ప్రజాపరిషత్తు, జిల్లా ప్రజా పరిషత్తు పేర్లతో నామకరణం చేశారు. మండల పరిషత్ అధ్యక్షుడు, జిల్లా పరిషత్తు అధ్యక్షుడు ఎన్నికకు నేరుగా ఎన్నికలు జరిపించారు. అటు తర్వాత ఆయనే మండల ప్రాదేశిక నియోజకవర్గం (ఎంపిటిసి) జిల్లా ప్రాదేశిక నియోజకవర్గం (జెడ్‌పిటిసి) లుగా విభజించి ఎన్నికలు జరిపించారు. దీనితో మూడంచెల వ్యవస్థ కాస్తా గందరగోళంగా మారిపోతుంది. అటు తర్వాత 1992 లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా, రాజ్యాంగం లోని 9వ షెడ్యూల్ ఆర్టికల్ 243 ననుసరించి స్థానిక స్వపరి పాలనా సంస్థలకు స్వయం పాలనా హక్కుగా గిరిజనులకు పీసా చట్టం లాంటి హక్కులు సంక్రమింపజేయడంతో మన స్థానిక స్వపరిపాలన వ్యవస్థ బలోపేతం అయింది. అయితే ఎంపిటిసి, జెడ్‌పిటిసి, సర్పంచ్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు జరిపి, ఎంపికైన వారి ద్వారా పరోక్ష ఎన్నిక ద్వారా మండల పరిషత్తు, జిల్లా పరిషత్ అధ్యక్షులు ఎన్నికలు జరిగాయి.తెలంగాణ రాష్ట్ర విభజన తర్వాత 2018లో కెసిఆర్ నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని తెచ్చినప్పటికీ తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించడంతప్ప అందులో కొత్తదనం పెద్దగా ఏమీ లేదు. ఉన్న ఎన్నికల విధానాన్నే యథాతథంగా కొనసాగిస్తూ వచ్చారు. ఫలితంగా పంచాయతీ, మధ్యమ స్థాయి, ఉన్నత స్థాయి లో రెండు రకాల ప్రజాప్రతినిధులు వ్యవస్థలు వచ్చి గందరగోళంగా, ప్రజలకు భారంగా మారింది. వాస్తవంగా గ్రామ సర్పంచ్, ఎంపిటిసి ఎన్నికల పరిధి దరిదాపు ఒక్కటే! ఇక అధికారాలు విషయానికి వేస్తే ఎంపిటిసిలకు మండలాధ్యక్షుల ఎంపిక, తొలగింపు అంశాలలో ప్రాధాన్యత తప్ప గ్రామ పంచాయతీపై మరే అధికారాలు లేవు. ఇక సర్పంచ్ గ్రామ పరిపాలనపై పూర్తి ఆధిపత్యం ఉంటుంది. మండల పరిషత్తు సమావేశంలో పాల్గొనే హక్కు ఉంటుంది కానీ, ఓటింగ్ విషయంలో, బిల్లుల, బడ్జెట్ ఆమోదం లాంటి ఎలాంటి హక్కులు లేకపోవడం వలన, మండల పరిషత్తు సమావేశంలో తమ సమస్యలు ప్రశ్నించడం తప్ప, మండల అధ్యక్షుడు, అధికారులను నియంత్రణ చేసే ఎలాంటి అధికారం లేని నామమాత్రపు సభ్యులుగా సర్పంచ్‌లు మండల పరిధిలో ఉంటారు. ఇక జిల్లా స్థాయి లో కూడా అదే పరిస్థితి ప్రత్యేకంగా ఎన్నికైన జెడ్‌పిటిసి సభ్యులు జిల్లా పరిషత్తు చైర్మన్ ఎన్నిక చేసే, లేక అవిశ్వాసం పెట్టగల అధికారం కలిగి ఉంటారు. ఇక జిల్లా పరిషత్తు సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షులు పాల్గొన్నా, మండలంలో సర్పంచ్‌లు ప్రాతినిధ్యం మాదిరే ఇక్కడ మండలం అధ్యక్షుడు అధికారాలకు కత్తెర వేయబడుతుంది. అంటే దీన్ని బట్టి మన పంచాయతీరాజ్ వ్యవస్థ ఎన్నికల విధానం, అధికారాల విభజన, అధికార పరిధి అంతా గందరగోళంగా మార్చివేశారు. ప్రభుత్వాలు మారుతున్నా అదే అధికార విభజన, అదే ఎన్నికల విధానం తప్ప అనర్ధదాయకం అయిన, ఖర్చుతో కూడిన ఎన్నికల విధానం సంస్కరణ చేద్దామనే ఆలోచనకు ఎవరూ సాహసించడం లేదు. ఒక్క గ్రామ పంచాయతీ ఎన్నిక ప్రత్యక్షంగా నిర్వహిస్తే, పరోక్ష ఎన్నికల ద్వారా మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్మాణం అయ్యే అవకాశం ఉన్నా కొత్త ఒక వింత పాత ఒక రోతలాగా మన పంచాయతీ రాజ్ వ్యవస్థను చూస్తూ, అధికారాలు విభజన గందరగోళం, మూడంచెల వ్యవస్థకు

# మహిళల హక్కుల పట్ల అవగాహన అవసరం

న్యూఢిల్లీ,ఆధునిక సమాజంలో గృహ హింసలు, స్త్రీలపై అత్యా చారాలు, లైంగిక వేధింపులు నానాటికీ అధికం అవుతున్నాయి. ఆత్మనూన్యతా భావానికి లోనై స్త్రీలు ఆత్మహత్యలు చేసుకోవడం కొనసాగుతూ ఉన్నాయి. వీటిన్నింటినీ అరికట్టే ప్రయత్నంలో 1999 డిసెంబరు 17వ తేదీన ఐక్య రాజ్యసమితి ఒక తీర్మానాన్ని చేసి, ప్రతి ఏడు నవంబరు 25న స్త్రీల హక్కుల పరిరక్షణ, స్త్రీ హింసావ్యతిరేక దినంగా పాటించాలని తీర్మానించింది. అనాది నుండి అబలలుగా ముద్ర వేయబడిన ఆడవారికి అడుగు వేస్తే ఆపద, గడియ గడియకో గండం, అనుక్షణం ఆందోళన, మహిళలపై అణచి వేతలు కొనసాగుతుండడం నిత్యకృత్యాలే అవుతున్నాయి. మహిళలకు రాజ్యాంగం ఎన్నో హక్కులు (%ఔశీఎవఅ%'%ం తీఱస్త్రష్ట్రం%)కల్పించినా వాటిపై సరైన అవగాహన లేకపోవడం, కనీసం వాటి గురించి తెలి యకపోవడంతో అతివలు మరింత అన్యాయాలకు గురవుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెస్తున్నా ఆచరణలో సాధ్యం కానిపరిస్థితి. పుట్టక ముందే భ్రూణహత్యలు, పుట్టిన తర్వాత వివక్షలు, మగువలు జీవితాలను నరకప్రాయం చేస్తున్నాయి. తమపై వివక్షను, వేధింపులను ఎదుర్కోవడానికి వారు ఎలాంటి నేరాలకు ఎలాంటి శిక్షలు ఉంటాయో తెలు సుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రధాన సెక్షన్లు

అందులో భాగంగా భారతీయ శిక్ష స్మృతిలోని కొన్ని ప్రధాన సెక్షన్లు సెక్షన్ 100 ప్రకా రం ఆత్మరక్షణ కోసం, ఒక వ్యక్తి మీద దాడి చేస్తే సదరు వ్యక్తి చనిపోయినా మీకు శిక్షపడదు. 166(బి) సెక్షన్ ప్రకా రం బాధితురాలికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స ఇవ్వకపోతే సంబంధిత సిబ్బంది, యాజమాన్యం మీద కేసు వేయవచ్చు. 228(ఏ) సెక్షన్ ద్వారా లైంగిక దాడికి గురైన మహిళ అనుమతి లేకుండా మీడియాలో ఆమె పేరు, ఫొటో లు ప్రచురించ కూడదు. అలా చేసిన పక్షంలో సదరు సంస్థ పై చర్యలు తీసుకోవచ్చు. 354సెక్షన్ ప్రకారం స్త్రీ శరీరాన్ని లైంగిక ఉద్దేశంతో చూసినా, తాకినా, అవమాన పర్చినా, అనుమతి లేకుండా ఫొటో, వీడియో తీసినా ఈ సెక్షన్ కింద ఫిర్యాదు చేయవచ్చు. 376 సెక్షన్ కింద మహిళల అనుమతి లేకుండా సెక్సులో పాల్గొంటే అది అత్యాచారంగా భావించి అది చట్టరీత్యా నేరం అవుతుంది. ఒకవేళ మైనర్ బాలిక ఆమె ఇష్టప్రకారమే చేసినా పురుషుడికి పోస్కో చట్టం క్రింద సుమారు పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష. భార్య ఉండగా, మరో పెళ్లి చేసుకుంటే 494సెక్షన్ ప్రకారం అతని మీద కేసు నమోదు చేయవచ్చు. కేసు రుజువైతే ఏడేళ్ల జైలు శిక్షపడుతుంది. 498(ఏ) సెక్షన్ ఓ వివాహితను ఆమె భర్తకానీ, భర్త బంధువులు కానీ అదనపు కట్నంకింద ధన, వస్తు, ఆభరణాలు అడిగితే ఈ సెక్షన్ ప్రకారం శిక్షార్హులు. గృహిణులను శారీరకంగా, మానసికంగా, హింసించి నా, అందుకు ప్రేరేపించినా, ప్రోత్సహించినా గృహ హింసా చట్టం కింద కేసు వేయవచ్చు. కనీసం మూడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించబడుతుంది. 509 సెక్షన్ మహిళలతో అవమానంగా మాట్లాడినా, సైగలు చేసినా, అసభ్యకర వస్తువులను ప్రదర్శించినా ఈ చట్టం ప్రకారం శిక్షకు అర్హులు. ఒంటరిగా ఉన్నప్పుడు అసభ్యకరంగా పాటలు పాడుతూ, శబ్దాలు చేస్తూ ఎవరైనా ఇబ్బంది పెడితే సెక్షన్ 294 ప్రకా రం వారిపై ఫిర్యాదు చేయవచ్చు. కనీసం మూడు నెలలకు తగ్గకుండా వారికి జైలుశిక్ష, లేదా కొంత జరిమానా వేయ వచ్చు. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా



మహిళను వెక్కిరించినా, అనుకరించినా, వారిపై సెక్షన్ 354(డీ) ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితులకు 3 నుంచి 5 ఏళ్ల వరకు జైలు శిక్షపడే అవకాశముంది.

ఆఫీసు పనుల్లో పనిచేసే ప్రదేశాల్లోతోటి ఉద్యోగులు గానీ, బాస్ గానీ ఆఫీసు పనుల్లో అలుసుగా తీసుకొని సెక్సువల్ కాంటాక్ట్

కోసం ఇబ్బంది పెడితే 2013 వేధిం పుల చట్టం ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. ఒకరి ఫొటోను మార్ఫింగ్ చేసి వారి శరీరాలకు ముఖాన్ని అతికించి ఇబ్బం దికరంగాఇంటర్నెట్లో షేర్ చేస్తున్న సంఘటనలలో సెక్షన్ 499 ప్రకారం ఫిర్యాదు చేయవచ్చు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షపడవచ్చు. ఒక మహిళను దౌర్జన్యంగా, బలప్రయోగం వల్ల తన శరీరంపై ఉన్న దుస్తులను తీసివేసినా, ఆ వ్యక్తికి సెక్షన్ 354(బీ) ప్రకారం 3 నుండి 7 ఏళ్ల జైలు శిక్ష పడుతుంది. 13/2013 సవరణల చట్టం ద్వారా ఈ సెక్షన్ అదనంగా చేర్చబడింది. ఒక మహిళ, విద్యార్థినికి సంబంధించిన రహస్య వ్యక్తిగత ఫొటోలు తీయడం, వీడి యోలు తీసి వాటిని ఇతరులకు పంపించినా 354(సీ) సెక్షన్ కింద ఏడాదినుంచి మూడేళ్ల వరకు జైలుశిక్ష పడు తుంది. వ్యభిచారానికి, 18 ఏళ్లలోపు బాలికను కొనుగోలు చేసినా సెక్షన్ 373 ప్రకారం పదేళ్ల జైలుశిక్ష విధించడంతో పాటు జరిమానా విధిస్తారు. బాలికను వ్యభిచారానికి మా రేందుకు ప్రోత్సహించినా, ప్రలోభ పెట్టినా సెక్షన్ 366(ఏ) కింద పదేళ్ల జైలు శిక్షతోపాటు జరిమానా విధించబడుతుం ది. నిండు గర్భిణిని చంపాలనే ఉద్దేశంతో చేపట్టిన ఒకచర్య పర్యవసానంగా ఆమె చనిపోతే నేరస్థుడిపై సెక్షన్ 316 ప్రకా రం ప్రాణహరణం కింద, నేరం మోపబడుతుంది. ఆమె మరణించడానికి బదులుగా గర్భంలోని శిశువు మరణిస్తే 10 ఏళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది. ఒక బృందంలోని సభ్యు లు ఒకమహిళపై లైంగిక దాడిచేసిన సందర్భాల్లోనూ వారి లో ప్రతివ్యక్తి నేరానికి పాల్పడినట్లే పరిగణించబడుతుంది. సెక్షన్ 376బీ కింద ప్రతి ఒక్కరికీ 20 ఏళ్లు తగ్గకుండా జీవితఖైదు శిక్షవిధిస్తారు. 13/2013 సవరణ చట్టం ద్వారా ఈ సెక్షన్ సవరించబడింది. స్త్రీ, బాలికను గానీ తన ఇష్టా నికి వ్యతిరేకంగా ఓ వ్యక్తిని వివాహం చేసుకునేందుకు బల వంతంగా అంగీకరించాలని ఒత్తిడి తేవడం, ఆస్త్రీని అపహ రిస్తే బలవంతంగా వివాహం చేసుకునే సెక్షన్ 366 కింద పదేళ్ల జైలు శిక్షతోపాటుజరిమానా పడుతుంది. ఇలాంటి చట్టాల ఎన్నో గురించి మహిళలు అవగాహన కలిగి ఉండా లి. అలాగే సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ స్త్రీల పట్ల బాధ్యతగా ప్రవర్తించా లి. సాటి మనుషులుగా మహిళలకు సామాజిక బాధ్యతగా సహకరించాలి.

# కొత్త లేబర్ కోడ్‌తో జర్నలిస్టులకు మేలు

హైదరాబాద్, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల కారణంగా వర్కింగ్ జర్నలిస్టుల నిర్వచనం మారిపోయిందని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు సంజయ్ కుమార్ ఉపాధ్యాయ అన్నారు. ఇప్పటి వరకు కేవలం ప్రింట్ మీడియా జర్నలిస్టులు మాత్రమే వర్కింగ్ జర్నలిస్టుల చట్టం కింద ఉన్నారని, ఇప్పుడు టెలివిజన్, రేడియో, డిజిటల్ మీడియాలో పని చేసే వారంతా జర్నలిస్టుల సంక్షేమ చట్టం పరిధిలోకి, కార్మిక భద్రతా వలయంలోకి వచ్చారన్నారు. ఈ బృహత్తర నిర్ణయంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా పాత్ర కూడా ఉండడం తమ యూనియన్‌కు గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్ పర్యటనలో భాగంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా తెలంగాణ అధ్యక్షుడు రాణా ప్రతాప్ రజ్జాభయ్యా, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ చట్టాలు అమలులోకి రావడానికి వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తూ వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో డబ్ల్యూజేఐ దీర్ఘకాల పోరాటం ఫలించినట్లయిందన్నారు. ఈ నిర్ణయంతో ప్రింట్ జర్నలిస్టులతో పాటూ డిజిటల్ మీడియా, టెలివిజన్, రేడియో జర్నలిస్టులూ అనేక ప్రయోజనాలు పొందుతారని తెలిపారు.కొత్త కార్మిక చట్టాలను వర్కింగ్ జర్నలిస్టుల కోణంలో స్వాగతిస్తున్నప్పటికీ.. పాత్రికేయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు ప్రభుత్వం నెరవేర్చాల్సిన బాధ్యతను మాత్రం ఎత్తిచూపుతామని సంజయ్ కుమార్ ఉపాధ్యాయ అన్నారు. తెలంగాణలో నూతన అక్రిడిటేషన్ పాలసీని వెంటనే ప్రకటించి అర్హులైన అందరికీ అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలనీ, రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రులలో హెల్త్ కార్డులను ఆమోదించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# సర్పంచ్ ఎన్నికల్లో బిసిలకు మోసం

హైదరాబాద్,సర్పంచ్ ఎన్నికలలో బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కొడంగల్ నియోజకవర్గం ఒక్కటే అభివృద్ధి కాదు.. పాలమూరు రంగారెడ్డి ఎక్కడకు పోయిందని ప్రశ్నించారు. పాలమూరు బిడ్డవే కదా ఏమైందని నిలదీశారు. ఒక్క నియోజకవర్గం అభివృద్ధి చెందితే అభివృద్ధి కాదు కదా అని అన్నారు. రాజ్యాధికారం ఎక్కడకు పోయిందని అడిగారు. కేంద్రంలో బీసీలకు ఒక్క మంత్రిత్వ శాఖ లేదని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వారికి ఓటు వేస్తే మరింత మోసమే జరుగుతుందని అన్నారు. ఏ పార్టీలో గెలిచినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిచాడని ప్రచారం చేసుకుంటారు కావచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చినచీర కట్టుకొని ఓట్లు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నా ఎన్నికల సంఘం ఏం చేస్తోందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ప్రజలకోసమే అయితే రెండు సంవత్సరాల నుంచి ఎందుకు చీరలు ఇవ్వలేదని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చిన చీర కట్టుకొని ఓటు వేయండని బహిరంగంగా ముఖ్యమంత్రి అంటున్నా ఎన్నికల కమిషన్ ఏం చేస్తుందన్నారు. ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్టు ఉంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైఖరి ఉందని విమర్శించారు.రెండేళ్ల నుంచి ఎక్కడకు పోయారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు ఎక్కడకు పోయాయని నిలదీశారు. అవ్వ తాతకు ఇస్తానని చెప్పిన పెన్షన్ ఎక్కడకు పోయిందని అడిగారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బడుగులకు బీసీ రిజర్వేషన్ల పై మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఎన్నో రకాల మోసాలను ఈ కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేసిందని విమర్శించారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెంలో ఒక్క బీసీ సర్పంచ్ లేడు అని.. మహబూబ్‌నగర్‌లో చాలా గ్రామాల్లో బీసీ సర్పంచ్‌లు లేరు, వార్డు మెంబర్లు లేరని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం వార్డు మెంబర్లకు ఇస్తారని.. సర్పంచ్‌లకు మాత్రం అది ఇవ్వరని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై ఎక్కడ నియమ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు.బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిట్టనిలువుగా ముంచిందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ ను తుంగలో తొక్కిందని విమర్శించారు. విద్యార్థుల్లారా మీ భవిష్యత్తు కోసం మా బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని అన్నారు. అసెంబ్లీలో విద్య, ఉద్యోగాలు, రాజకీయ పదవుల గురించి బిల్లు పాస్ చేశారు కానీ ఇప్పుడు విద్య, ఉద్యోగాలు ఎక్కడకు పోయాయి. ఆ బిల్లును ఎందుకు రాష్ట్రపతికి పంపలేదని ప్రశ్నించారు. అనేక హామీలను ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. బీసీలకు మంత్రి పదవులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తామని పీసీసీ అధ్యక్షుడు అన్నారని.. ఆ మాట ఎక్కడికి పోయిందని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. రాహుల్ గాంధీ నోట కూడా అబద్దాలు చెప్పించారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉన్నది బీఆర్ఎస్ పార్టీనే అని ఆయన స్పష్టం చేశారు. రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటి? ఇప్పుడు ఉన్న ఆర్థిక పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బీఫామ్ లేని ఎన్నికలు ఇవి అని.. అలాంటిది పార్టీ నుంచి గెలిపిస్తామని అనడం ఏంటని అన్నారు.బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటే అని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రూ.3వేల కోట్లు వెనక్కిపోతాయని కిషన్ రెడ్డి అనగానే.. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు వెళుతున్నాడని తెలిపారు. రూ.3వేల కోట్లకు చూసుకుంటే బీసీలు నిలువునా మోసపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 2014కు ముందు ఏముంది.. ఇప్పుడు ఏముంది ఆలోచన చేయాలని ప్రజలకు సూచించారు. ఏ ఎన్నిక వచ్చిన ఆలోచించి ఓటు వేయాలన్నారు. ఇప్పటికీ మోసపోయి గోసపడుతున్నామని తెలిపారు. ఈ రాష్ట్రానికి కేసీఆర్ మాత్రమే శ్రీరామ రక్ష అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతారని అన్నారు.

# 16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళ పూర్తి

అమరావతి,16 నెలల్లోనే 3 లక్షలకు పైగా ఇళ్ళు పూర్తి చేసినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. మరో అయిదు లక్షల ఇళ్లు ఉగాదిలోగా పూర్తి చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇంత వరకు ప్రారంభం కాని ఇళ్లు 3 లక్షల 30 వేల ఇళ్లు ఉన్నాయని వివరించారు. 15.59 లక్షల ఇళ్లు ఈ అయిదేళ్ళలో ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వమనే స్ఫూర్తితో సీఎం, మంత్రులు పనిచేస్తున్నామని మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టెక్నాలజీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ముందుంటున్నామన్నారు.గృహనిర్మాణ శాఖ విషయంలో మూడు లక్షల ఇళ్లు పూర్తి చేసిన సందర్భంగా కీ హ్యాండోవర్ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఆ కార్యక్రమాన్ని కూడా వైసీపీ వివాదం చేసిందని మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 8 లక్షల 627 ఇళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. అలాగే జగన్ సీఎంగా ఉన్నప్పుడు కేవలం 6 లక్షలు మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. హౌసింగ్ ఫర్ ఆల్ అని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రివ్యూలో ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి గృహప్రవేశం చేయిస్తామని చెప్పారు. ఉమ్మడి కుటుంబాలను ప్రోత్సహించేందుకు కామన్ వాల్‌తో కలిపి కట్టుకోవడానికి జీవో ఇస్తామన్నారు.

## రాంచంద్రాపూర్,కుర్మపల్లి గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేత

కరీంనగర్, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాంచంద్రాపూర్, కుర్మపల్లి గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికలు నిలిపివేస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాంచంద్రాపూర్‌కు అనుబంధంగా ఉన్న కుర్మపల్లి కొత్త పంచాయతీగా ఏర్పాటు కాగా, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేశారని రాంచంద్రాపూర్ గ్రామస్తులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల సంఘం ఈ రెండు గ్రామాల్లో ఎన్నికలు నిలిపివేసింది. జిల్లాల వారీగా మూడు విడుతల్లో జరిగే మండలాలు కరీంనగర్ జిల్లాలో మొదటి విడుత గంగాధర, రామడుగు, చొప్పదండి, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ ఉన్నాయి. రెండో విడుతలో చిగురుమామిడి, తిమ్మాపూర్, గన్నేరువరం, మానకొండూర్, శంకరపట్నం,మూడో విడుత వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట, హుస్నాబాద్, సైదాపూర్(వీ) ఉన్నాయి. ఇక జగిత్యాల జిల్లాలో ÷రిదటి విడుత మేడిపల్లి, భీమారం, కథలాపూర్, కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ఉన్నాయి. రెండో విడుతలో జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, సారంగాపూర్, రాయికల్, బీర్పూర్, మల్యాల, కొడిమ్యాల ఉన్నాయి. మూడో విడుతలో ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి, పెగడపల్లి ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో మొదటి విడుత మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్ ఉన్నాయి. రెండో విడుతలో పాలకుర్తి, అంతర్గాం, ధర్మారం, జూలపల్లి,మూడో విడుతలో సుల్తానాబాద్, ఎలిగేడు, పెద్దపల్లి, ఓదెల ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడతలో రుద్రంగి, వేములవాడ రూరల్, వేములవాడ, కోనరావుపేట,చందుర్తి, రెండో విడతలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, మూడో విడుత గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట ఉన్నాయి.దీంతో ఆయా గ్రామాల్లో అభ్యర్థుల సందడి మొదలయ్యింది. బుధవారం నామినేషన్లు మొదలు కావడంతో తొలిదశ గ్రామాల్లో హడావిడి కనిపించింది.

## కాంగ్రెస్ నయా స్కెచ్...

హైదరాబాద్,జూబ్లీహిల్స్‌లో 25 వేల ఓట్లతో బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు గ్రామాల్లో హస్తం రంగు వేయాలని స్కెచ్ లు వేస్తోంది. 90 శాతం సీట్లు.. మెజారిటీ సర్పంచ్‌లు.. టార్గెట్ గా రేవంత్ ఆర్మీ ఇప్పటికే గ్రౌండ్‌లో దిగిపోయిందట. ఆరు గ్యారెంటీలు, ఇందిరమ్మ ఇళ్లు ప్రచారాస్త్రాలుగా మలిచి గ్రామాల్లో ప్రచార దండయాత్రకు సిద్ధమైందట. ఇంతకీ కాంగ్రెస్ మార్క్ స్ట్రాటజీ ఎలా ఉండబోతోంది. పక్కా వ్యూహంతోనే మొదటగా పంచాయతీ ఎన్నికలు

90శాతం సీట్లు టార్గెట్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలుపు కాంగ్రెస్ పార్టీకి మరింత జోష్ తీసుకువచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 90శాతం సీట్లు సాధించి మార్క్ చూపించేందుకు సిద్ధమవుతున్నది. అందులో భాగంగా మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని పక్కా ప్లాన్ చేస్తున్నదట. ఇప్పటికే గ్రౌండ్ వర్క్ కూడా ప్రిపేర్ చేసుకుందని టాక్. స్థానిక ఎన్నికల అనంతరం జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నది. ఎవరెం చేసినా, ఎన్ని ప్లాన్స్ చేసినా.. .స్థానిక ఎన్నికల్లో సైతం జూబ్లీహిల్స్ బై పోల్ వచ్చిన రికార్డులే వస్తాయనిధీమా వ్యక్తం చేస్తున్నదట. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నదట హస్తం పార్టీ.

రెండేళ్ల ప్రగతి వివరణ

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతుండటంతో ఈ రెండేళ్లలో సాధించిన ప్రగతిని వివరించేందుకు సిద్ధమవుతుంది. డిసెంబర్ 1 నుంచి 9వరకు ప్రభుత్వం.. ప్రజాపాలన దినోత్సవాలను నిర్వహించబోతున్నది. ఈ వారోత్సవాల్లో ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారంటీలు.. ఇప్పటికే అమలు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమా లు, పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని భావిస్తున్నది. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రజా ప్రతినిధులకు సూచనలు చేసినట్లు సమాచారం.

రుణ మాఫీ, మహిళలకు రుణాలు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, మహిళలకోసం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించబోతున్నట్లు సమాచారం. రుణ మాఫీ, మహిళలకు రుణాలు, సబ్సిడీపై గ్యాస్, ఉచిత కరెంటు, ఉద్యోగాల కల్పన అంశాలను విస్తృతంగా ఇంటింటికి వివరించేందుకు సిద్ధమవుతుందట. అంతేగాకుండా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సైతం ప్రధాన అస్త్రంగా చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తుందట. ఇప్పటికే మహిళా సంఘాల్లోని సభ్యులకు ఉచితంగా చీరల పంపిణీ చేపడుతుంది. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలోని నేతలను భాగస్వాములను చేస్తూ ప్రచార స్పీడ్ పెంచింది. ఇంటింటికి వెళ్లి పంపిణీ చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు సైతం జారీచేసింది. దీనికి తోడు ప్రభుత్వ పథ కాలతో పాటు చేస్తున్న సంక్షేమం, ఈ చీరల పంపిణీ కార్యక్రమానికి చెందిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో అప్లోడ్ చేస్తూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. గ్రామాల్లో సైతం వాట్సాప్ గ్రూపుల్లోనూ ప్రచారం చేయాలని సోషల్ మీడియాకు సూచనలు చేసిందట.


ప్రభుత్వంపై విమర్శలకు గట్టి కౌంటర్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను మరోసారి ప్రజలకు వివరించాలని పార్టీ నేతలకు సూచించిందట. అంతే గాకుండా ప్రభుత్వంపై విమర్శలకు గట్టి కౌంటర్లు ఇవ్వాలని ఇదే స్థానిక సంస్థల ఎన్నికల్లో అస్త్రంగా పనిచేస్తుందని చెప్పినట్టు సమాచారం. ప్రజల్లో బీఆర్ఎస్ వైఫల్యాలను ఎప్పటికప్పుడు మననం చేస్తుండాలని ఆదేశించినట్లు తెలిసింది. ఏది ఏమైనా కాంగ్రెస్ మెజార్టీ సర్పంచ్ స్థానాలను సాధించడ మే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. ఇప్పటి నుంచే పార్టీ అధిష్టానం సైతం ఆదేశాలు ఇస్తూ నేతలను అలర్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## మన నాగరికత భారతదేశానికి పునాది

అమరావతి,మన సంస్కృతి, నాగరికత భారతదేశానికి పునాదిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మం యొక్క లోతైన జ్ఞానం మనకు సహనం, శాంతి, సామరస్యంతో పాటు.. సృష్టి పట్ల లోతైన గౌరవాన్ని నేర్పిందని తెలిపారు. వలస పాలకులు, తూర్పు భారతదేశ వ్యాపారులు కలిసి మన భౌతిక సంపదను దోచుకోవడమే కాకుండా న్యూనత, తక్కువ ఆత్మగౌరవం వంటి విత్తనాలను కూడా నాటారని అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. మేథో, సాంస్కృతిక విధ్వంసాన్ని థామస్ బాబింగ్టన్ మెకాలే వంటి వ్యక్తులు చాకచక్యంగా ప్రణాళిక చేసి అమలు చేశారని చెప్పారు. వారు ఇంగ్లీషును సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడని, మన సొంత వారసత్వం గురించి సిగ్గుపడటం నేర్పిన మేథో.. సాంస్కృతిక బానిసత్వానికి ఒక బ్లూప్రింట్ వంటి వారని అభివర్ణించారు. వలసవాదులు భౌతికంగా వెళ్లిపోయిన చాలా కాలం తర్వాత కూడా.. ఈ వలస మనస్తత్వానికి సంబంధించిన హ్యాంగోవర్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన సొంత గుర్తింపును తిరిగి పొందేందుకు.. నిర్ణయాత్మక చొరవ తీసుకున్నందుకు సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. రేస్‌కోర్స్ రోడ్ పేరును లోక్ కళ్యాణ్ మార్గ్‌గా మార్చడం ప్రజల దృష్టిని సంక్షేమం వైపు మారుస్తుందన్నారు. ఈరోజు శ్రీరామ జన్మభూమి ఆలయంలో ధ్వజారోహణం కార్యక్రమం.. సాంస్కృతిక పునరుజ్జీవనం, నాగరికత ధృవీకరణను సూచిస్తుందని చెప్పారు. మనందరిలో భారత్ భవిష్యత్తు ఉందని..

# సీఎంగారూ జాబ్ క్యాలెండర్ మరిచారా?



హైదరాబాద్,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడానికి నిరుద్యోగ అంశం ప్రధానమై నది. ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ యువతకు జాబ్‌క్యాలెండర్‌ను, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించింది. మొదటి ఏడాదిలోనే రెండు లక్షలు ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీనిచ్చింది. 2024 ఆగస్టు రెండవ తేదీన రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాబ్ క్యాలెండర్‌ను పద్దెనిమిది రకాల ఉద్యోగాల నోటిఫికేషన్లతో ప్రకటించారు. విద్యుత్ సంస్థల్లో ఇంజనీరింగ్ పోస్టులు, డీఎస్సీ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, ఎస్ఐ, కానిస్టేబుల్, ఫారెస్ట్ రేంజ్ పరీక్షలు ఇలా మరికొన్ని పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చి జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించింది. నిరుద్యోగులు సంతోషించారు, తమకు జాబ్ వస్తుందని ఆశపడ్డారు. కానీ ఇప్పటివరకు ఆ జాబ్ క్యాలెండర్ హామీని అమలు చేయలేదు. తర్వాత ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు కావస్తున్నా హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. ఎప్పుడు ఏ ఉద్యోగం ఖాళీ అవుతుందో, అదే నెలలో జాబ్ క్యాలెండర్‌లో ప్రకటించి భర్తీ చేస్తామని చెప్పి తూతూ మంత్రంగా నోటిఫికేషన్ విడుదల చేసింది తప్ప చిత్తశుద్ధితో అమలు చేయలేదు.

పెరుగుతున్న నిరుద్యోగం

2022 బిస్వాల్ కమిటీ నాటికి తెలంగాణ రాష్ట్రంలో లక్షా 91 వేల 126 ఖాళీలు ఉండగా, 2025 నాటికి రెండు లక్షలకు పెరిగింది. ఇప్పటికి రాష్ట్రంలో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ అయింది 58,122 మాత్రమే (ఈ పోస్టుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చినవి సుమారు యాభై వేల పోస్టులు) మాత్రమే. వీటిని కూడా సరిగ్గా భర్తీ చేయలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత భర్తీచేసిన ఉద్యోగాలు 2024లో 9,952, 2025లో 607 పోస్టులు మాత్రమే. కానీ సర్కార్ మాత్రం యాభై వేల పోస్టులు భర్తీ చేశామని ప్రకటించుకున్నది. పైగా గత సర్కార్ ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలివ్వడం, పరీక్షలు పూర్తి చేసి నియామక పత్రాలు ఇవ్వడం చేసింది. ప్రస్తుత ప్రభుత్వం 2024లో విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నేటికీ అమలు కాకపోగా, 2025లో కొత్తగా విడుదల కూడా చేయలేదు. దీంతో మొదటి ఏడాదిలోనే లక్ష ఉద్యోగాల వాగ్దానం గాల్లోనే కలిపినట్టయింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకై యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీ తీర్చిదిద్ది జాబ్ క్యాలెండర్ ఇయర్ ప్రకటిస్తామని హామీనిచ్చింది. దీంతో అప్పటికే అధికా రంలో ఉన్న ప్రభుత్వంపై విసుగు చెందిన యువత కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషిచేసింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది నెలల తర్వాత అస్పష్టమైన జాబ్ క్యాలెండర్‌ను అసెంబ్లీలో ప్రకటించింది.కానీ, ఇప్పటివరకు జాబ్ క్యాలెండర్ ప్రకారం ఏ ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయ లేదు. అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ప్రతియేటా జూన్ రెండు నాటికీ జాబ్ క్యాలెండర్ విడుదల చేసి సెప్టెంబర్ 17 నాటికీ నియామకాలు పూర్తి చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి మరి దాన్ని బుట్టదాఖలు చేసింది. నేడు టీజీపీఎస్సీలో అధికారికంగా 35 లక్షల మంది వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోనివారు పది లక్షల మంది వరకు ఉంటారు. మొత్తం 45 లక్షల వరకు నిరుద్యోగులు ఉద్యోగాలకై వేచి చూస్తున్నారు. వీరంతా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

హామీలే తప్ప అమలేది?

కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టోలో హైద్రాబాద్ యూత్ డిక్లరేషన్ ప్రకటించింది. అమరవీరుల, ఉద్యమకారుల కుటుంబాలకు గుర్తింపు ఇస్తామని చెప్పింది. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన యువతీ, యువకులను ఉద్యమ అమరవీరులుగా గుర్తించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని చెప్పింది. తల్లీ/తండ్రి/భార్యకు నెలవారీగా రూ.2500 అమరవీరుల గౌరవ పెన్షన్ ఇస్తామని, పారదర్శకంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలను చెప్పడతామని చెప్పింది. మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొంది. నిరుద్యోగ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సెంట్రలైజ్డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టలను ఏర్పాటు చేసి ఏడు జోన్లలో ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్‌లను, ప్రతి జిల్లాలో స్కిల్‌డెవలప్మెంట్ సెంటర్లను నెలకొల్పు తామని చెప్పింది.ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రయివేటు కంపెనీల్లో తెలంగాణ యువతకు 75శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు యూత్ కమిషన్‌ను ఏర్పాటు చేసి రూ.పది లక్షల వరకు వడ్డీలేని రుణ సదుపాయాలను కల్పిస్తామని చెప్పింది. ప్రత్యేక గల్ఫ్ విభాగం ఏర్పా టుతో గల్ఫ్ ఏజెంట్ల నియంత్రణ, గల్ఫ్ దేశాల్లో మెరుగైన ఉపాధి కల్పనతో పాటు, గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటా మని, పద్దెనిమిదేండ్ల పైబడి చదువు కొనే ప్రతీ యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లు అందజేస్తామని ఈ హామీలతో ఏఐసీసీ అగ్ర నాయకులు ప్రియాంక గాంధీ చేతులు మీదుగా ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా ఇందులో ఒక్కటీ అమలు చేసింది లేదు.

నిరుద్యోగుల నిర్బంధం

ప్రతి ఏడాది రాష్ట్రంలో ఆయా ప్రభుత్వ శాఖల్లో సుమారు తొమ్మిది వేల మంది పదవీవిరమణ పొందుతున్నారు. ఇవ్వన్ని భర్తీ చేయాల్సిన పోస్టులు అయినప్పటికీ ప్రభుత్వం నియామకాలు చేపట్ట కుండా కాలయాపన చేస్తున్నది. కొలువుల కోసం కొట్లాడుతున్న నిరుద్యోగులపై నిర్బంధాలను ప్రయోగిస్తున్నది. ఒక వైపు ప్రజపాలన అంటూనే మరోవైపు హామీలను అమలు చేయాలని అడుగు తున్నా వారిపై నియంతృత్వంగా వ్యవహరి స్తున్నది. ఎన్నికల ముందు సెంట్రల్ లైబ్రరీకి వెళ్లిన కాంగ్రెస్ అదినాయకుడు రాహుల్ గాంధీ,ప్రస్తుత ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి యువతకు అనేక హామీలనిచ్చారు. ఇప్పుడు అదే సెంట్రల్ లైబ్రరీలోకి నిరుద్యోగుల్ని రాకుండా ఆంక్షలు పెట్టి అడ్డుకుంటు న్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ జాబ్ లేస్ క్యాలెండర్‌గా మార్చకుండా ఇచ్చిన హామీల ప్రకారం స్పష్టమైన వివరాలతో జాబ్ క్యాలెండర్‌ను అమలు చేయాలి. స్థానిక ఎన్నికలలోపే నోటిఫికేషన్స్ వేసి నియామకాలను చేపట్టాలి. నిర్లక్ష్యం చేస్తే నిరుద్యోగ యువతీ, యువకులు తగిన గుణపాఠం చెబుతారు.

## నితీశ్ తొలి కేబినేట్‌లో కీలక నిర్ణయాలు

పాట్నా, ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్‌గా బీహార్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలని సిఎం నితీశ్ కుమార్ నిర్ణయించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం అనంతరం నితీశ్ కుమార్ మంత్రివర్గం మంగళవారంనాడు తొలిసారి సమావేశమైంది. నితీశ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్ర యువతకు కోటి ఉద్యోగాలు కల్పించాలని, 'సమావేశానంతరం బిహార్ చీఫ్ సెక్రటరీ ప్రత్యయ్ అమ్రిత్ ఆ వివరాలను మీడియాకు తెలిపారు. విస్తృత ఉద్యోగావకాశాల కల్పన, పారిశ్రామిక అభివృద్ధిపై సమావేశంలో కీలకంగా చర్చ జరిగినట్టు ఆయన చెప్పారు. డిఫెన్స్ కారిడార్, సెమికండక్టర్ తయారీ పార్క్, గ్లోబల్ కెపాసిటీ సెంటర్లు, మెగా టెక్ సిటీ, ఫిట్‌నెస్ సిటీ ఏర్పాటుతో బీహార్‌ను ఈస్టర్న్ ఇండియా టెక్ హబ్‌గా తయారు చేయాలని సమావేశంలో నిర్ణయించినట్టు సీఎస్ తెలిపారు. న్యూఏజ్ ఎకానమీ కింద రాబోయే ఐదేళ్లలో గ్లోబల్ వర్క్‌ప్లేస్‌గా బీహార్‌ను అభివృద్ధి చేయనున్నామని, ఈ లక్ష్య సాధనకు డెడికేటెడ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్టార్టప్ డొమైన్‌లో రాష్ట్రంలోని ప్రతిభావంతులు, యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా ప్రణాళికలు రూపొందించేందుకు ఒక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేశామని తెలిపారు. ఏఐ డొమైన్‌లో కూడా బీహార్‌ను లీడింగ్ స్టేట్‌గా తీర్చిదిద్ద నున్నామని, ఇందుకు అవసరమైన ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మిషన్‌కు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపిందని సీఎస్ తెలిపారు. సోనెపూర్, సీతామర్హితో సహా 12 సిటీల్లో గ్రీన్‌ఫీల్డ్ టౌన్‌షిప్ ప్రాజెక్టులను ప్రారంభించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మూతపడిన 9 చక్కెర మిల్లులను పునరుద్ధరించాలని, 25 కొత్త మిల్లలను ఏర్పాటు చేయాలని కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చీఫ్ సెక్రటరీ వివరించారు.

# సత్వర న్యాయం.. ఇంకెంత దూరం?



న్యూఢిల్లీ,న్యాయం సత్వరం, సకాలంలో పొందడం పౌరుడి ప్రాథమిక హక్కు. కానీ, భారతదేశంలో న్యాయస్థానం గడప తొక్కిన ఏ పౌరుడికైనా, కేసు చిన్నదా పెద్దదా అనే విషయంతో సంబంధం లేకుండా పరిష్కారానికి ఏళ్లూపూళ్లూ పడుతోందంటే అతిశయోక్తి కాదు. న్యాయం జరగడంలో ఆలస్యమైతే అది అన్యాయంతో సమానమన్న హితోక్తి ఆచరణలో అసాధ్యంగా మారింది. ఈ నేపథ్యంలో పెండింగ్ కేసుల పరిష్కారం, మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడం తన ముందున్న రెండు ప్రధాన ప్రాధాన్యతలని జస్టిస్ సూర్యకాంత్ భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు చేపట్టడానికి ముందు చేసిన ప్రకటన న్యాయ వ్యవస్థ ప్రక్షాళనకు సమయం ఆసన్నమైందని సూచిస్తోంది. వివాదాలను పరిష్కరించడంలో మధ్యవర్తిత్వం గేమ్ ఛేంజర్ కావచ్చునన్న ఆయన అభిప్రాయం నూటికి నూరుపాళ్లూ వాస్తవం. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో పెండింగ్ కేసుల సంఖ్య జస్టిస్ సూర్యకాంత్ మాటల్లో చెప్పాలంటే 90 వేలకు పైమాటే. ఇక జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ ప్రకారం దేశవ్యాప్తంగా కిందిస్థాయి కోర్టులలో 4.78 కోట్ల కేసులు, హైకోర్టులలో 63.80 లక్షల కేసులు పరిష్కారం కావలసి ఉంది.ఒక్క తెలంగాణ హైకోర్టులోనే దాదాపు 2.36 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా. కేసులు ఇలా కొండల్లా పేరుకుపోవడానికి కారణం న్యాయమూర్తులు, సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి, మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సవరణలకు నోచని చట్టాలు కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. దేశంలోని 25 హైకోర్టులలో ఉండాల్సిన 1122 మంది న్యాయమూర్తులకు గాను మొన్న జులై నాటికి 751 మందే ఉన్నారు. ఈ లెక్కన పెండింగ్ కేసులు పరిష్కారం కావాలంటే ఒక్కొక్క న్యాయమూర్తి 8,400కు పైగా కేసుల విచారణ జరపాల్సి ఉంటుంది. ఇక జిల్లా, సబార్డినేట్ కోర్టులలో మొత్తం 25,741 న్యాయమూర్తుల పోస్టులకు 5262 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనాభాకు సరైన నిష్పత్తిలో న్యాయమూర్తులు లేకపోతే, ప్రజలలో న్యాయస్థానాలపై విశ్వసనీయత సన్నగిల్లుతున్న ఇంగితం పాలకుల్లో కొరవడిన కారణంగానే ఈ దుస్థితి దాపురించింది. న్యాయస్థానాల్లో మౌలిక వసతుల కల్పనకు, ఇతరత్రా సౌకర్యాలకూ బడ్జెట్‌లో చాలినన్ని నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వాలను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో కేసుల సత్వర పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం, సర్వోన్నత న్యాయస్థానం కొత్త రకం విధానాలను అందిపుచ్చుకునేందుకు అడుగులు వేస్తున్నాయి.న్యాయమూర్తుల కొరతను అధిగమించేందుకు హైకోర్టులలో తాత్కాలిక న్యాయమూర్తులను నియమించుకోవాలన్న ఆలోచన ఈ కోవకు చెందినదే. 224ఎ రాజ్యాంగ అధికరణ ఇందుకు అనుమతినిస్తున్నా, ఈ తరహా నియామకాలు త్వరితగతిన జరగడం లేదు. సివిల్ ప్రొసీజర్ కోడ్ లోని సెక్షన్ 89కి సవరణ జరపడం ద్వారా, మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారానికి బాట వేయడం, ప్రత్యేక లోక్ అదాలత్‌ల ఏర్పాటు వంటివి కూడా చెప్పుకోదగిన పరిణామాలే. కానీ పెండింగ్ కేసుల పరిష్కారానికి ఈ చర్యలు ఏ మాత్రం చాలవని చెప్పడంలో సందేహం అక్కరలేదు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో భారతీయ న్యాయస్థానాలు వెనకబడి ఉన్నాయి. చైనా, ఎస్టోనియా, జర్మనీ వంటి దేశాలు కృత్రిమ మేధ సహాయంతో చిటికెలో వందలాది కేసులను పరిష్కరిస్తున్నాయి. ఈ దేశాల్లో అమలవుతున్న న్యాయ నమూనాలను ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పరిశీలించి, కొందరు జిల్లా న్యాయమూర్తులను ఎంపిక చేసి సింగపూర్‌లో శిక్షణ ఇప్పించింది.ముంబయి, బెంగళూరు, ఢిల్లీల్లో ఎఐ టెక్నాలజీని వినియోగించి కేసుల పరిష్కారానికి ఓ పైలట్ ప్రాజెక్టునూ నిర్వహించారు. దీనివల్ల పెండింగ్ కేసులు 20 శాతం మేర తగ్గినట్లు నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ అధ్యయనంలో తేలింది. అయినప్పటికీ ఈ విధానాలు అమలుకు నోచుకోకపోవడం మన దేశంలో పాలనాపరమైన అలసత్వానికి ఒక నిదర్శనం. ఈ నేపథ్యంలో న్యాయం పొందడమనేది ఒక సుదీర్ఘమైన, కాలాతీతమైన, ఖర్చుతో కూడుకున్న ప్రక్రియగా నగటు భారతీయుడు భావిస్తున్నాడంటే ఆశ్చర్యమేముంటుంది? వివాదం ఎంతటి తీవ్రమైనదైనా దేశంలో 40% మంది న్యాయస్థానాల గడప తొక్కకుండా, పెద్ద మనుషుల సాయంతోనో, ఇతరేతర విధానాల ద్వారానో పరిష్కరించుకునేందుకు మొగ్గు చూపుతున్నారని ఆ మధ్య ఓ అధ్యయనంలో తేలింది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు భారత కొత్త ప్రధాన న్యాయమూర్తి ఇతోధికంగా కృషి చేస్తారని ఆశిద్దాం.

## సంక్రాంతి వరకు ఆప్కో వస్త్రాలపై రిబేటు

అమరావతి, రాష్ట్ర ప్రజలకు ఆప్కో షోరూమ్‌లలో చేనేత వస్త్రాలపై 40 శాతం రాయితీని సంక్రాంతి వరకూ అమలు చేయనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో ప్రవేశపెట్టిన రాయితీని ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో సక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయితీ అమ్మకాలతో ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేసే అవకాశం కలుగుతుందన్నారు. అలాగే వస్త్రాల విక్రయాల పెరుగుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసాతో కూడిన ఉపాధి లభిస్తుందని తెలిపారు. రాయితీ ఇవ్వడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షోరూమ్‌లలో రోజుకు సరాసరి రూ.3 లక్షలు చొప్పున విక్రయాలు జరిగేవని, రాయితీ ఇవ్వడంతో ప్రస్తుతం రూ.9 లక్షలకు పెరిగినట్లు మంత్రి పేర్కొన్నారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

విజయవాడ, మార్కెట్లో బంగారం ధర మరోమారు బాగానే పెరిగింది. 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.1,27,050కి చేరుకుంది. అదేవిధంగా 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,16,460 గాను, 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర రూ. 95, 290 గా ఉంది. వెండి కిలో ధర రూ.100 మేర పెరిగి.. 1,67,100 లుగా ఉంది. ఇటీవల లక్షా 30 వేల మార్క్ దాటిన పసిడి ధరలు.. ఆ తర్వాత తగ్గినట్లే తగ్గి.. మళ్లీ పెరుగుతున్నాయి. ఈ ఉదయం 7 గంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో బంగారం 24 క్యారెట్లు 10 గ్రాముల ధర రూ.1,27,050 ఉంది. 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,16,460 ఉంది. వెండి కిలో ధర రూ.1,74,100గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలలో బంగారం 24 క్యారెట్లు 10 గ్రాముల ధర రూ.1,27,050. 22 క్యారెట్ల ధర రూ.1,16,460. కిలో వెండి ధర రూ.1,74,100గా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,27,050, 22 క్యారెట్లు రూ.1,16,460. వెండి కిలో ధర రూ.1,67,100

## పెను సంచలనం!

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌ను మరోసారి ప్రపంచ స్థాయి చర్చల్లో నిలబెడుతూ కోకాపేట భూమి ధరలు కొత్త రికార్డు సృష్టించాయి. ప్రభుత్వ భూ వేలంలో ఒక్క ఏకరానికి భారీగా రూ.137 కోట్లు పలకడం పెట్టుబడిదారులను, రియల్ ఎస్టేట్ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేసింది. అధికారులు మొదట్లో ఊహించిన బేస్ ధర కంటే రెట్టింపు ఉత్సాహం కనిపించడంతో ఈ వేలం నగర రియల్ ఎస్టేట్‌లో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

అవుట్‌స్కర్ట్స్ నుంచి ప్రీమియం జోన్‌గా కోకాపేట

కొన్నేళ్ల క్రితం వరకు నగర శివార్ల ప్రాంతంగా పరిగణించిన కోకాపేట, ప్రస్తుతం హైటెక్ సిటీ – ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ల విస్తరణ కారణంగా అత్యంత ప్రాధాన్య ప్రాంతంగా మారింది. భారీ కమర్షియల్ ప్రాజెక్టులు రాబోతుండటం... అంతర్జాతీయ స్థాయి రోడ్డు కనెక్టివిటీ (ఓఆర్ఆర్) అందుబాటులో ఉండటం... వేగంగా పెరుగుతున్న ఐటీ హబ్ సమీపంలో ఉండటం... ఈ కారణాల వల్ల ఈ ప్రాంతంపై జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారుల దృష్టి గణనీయంగా పెరిగింది. ప్రభుత్వం ఏకరానికి రూ.99 కోట్లుగా బేస్ ప్రైస్‌ను నిర్ణయించింది. అయితే వివిధ ప్రధాన రియల్ ఎస్టేట్ కంపెనీల మధ్య నెలకొన్న ఆరోగ్యకరమైన పోటీ కారణంగా చివరి బిడ్ నేరుగా రూ.137 కోట్ల వరకు చేరింది.

రాయదుర్గ్ తర్వాత కోకాపేట కొత్త హాట్‌స్పాట్

ఇప్పటివరకు ఏకరానికి అత్యధిక ధరను రాయదుర్గ్ రికార్డు చేసింది దాదాపు రూ.177 కోట్లు. అయితే అక్కడ భూమి లభ్యత తగ్గిపోవడంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ప్రత్యామ్నాయంగా కోకాపేట వైపు దృష్టి మళ్లించారు. ఈ కొత్త రికార్డు, ప్రధాన ఐటీ కారిడార్ నుంచి పెట్టుబడుల డిమాండ్ ఎలా పరిసర ప్రాంతాలకు విస్తరించిందో స్పష్టంగా చూపిస్తోంది. కేవలం కొద్ది కిలోమీటర్ల దూరంలో ఉన్న కోకాపేట, రాయదుర్గ్‌కు సమానమైన మౌలిక సదుపాయాలు.. భవిష్యత్ వృద్ధి అవకాశాలను అందించడం ఈ డిమాండ్‌కు ప్రధాన కారణం.

భవిష్యత్ వృద్ధికి కోకాపేటే కేంద్రబిందువు

రియల్ ఎస్టేట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. కోకాపేటను తదుపరి ప్రీమియం ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా మార్చే అంశాలున్నాయి. రాబోయే ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ వల్ల పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు.. గ్రీన్‌ఫీల్డ్ అభివృద్ధి సాధ్యమవుతుంది.. నూతన టెక్ జోన్ల ఏర్పాటుకు.. ఐటీ పరిశ్రమ విస్తరణకు అవకాశాలు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చెంది విస్తృతంగా ఏర్పాటు కానున్న రోడ్లు , ఇతర మౌలిక సదుపాయాలు కల్పించబడుతాయి. ఓఆర్ఆర్ , నూతన రోడ్డు కనెక్టివిటీ: నగరంలోని ఇతర ప్రాంతాలకు వేగవంతమైన ప్రయాణం సులభంగా సాధ్యమవుతుంది.. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నగరం. దీంతో ప్రధాన ఐటీ హబ్ చుట్టుపక్కల ప్రాంతాలను కూడా పెట్టుబడిదారులు పెద్దగా పరిశీలిస్తున్నారు. కోకాపేటలో తాజా వేలం,హైదరాబాద్ రియల్ ఎస్టేట్ లో పెద్ద ఊపు వచ్చేసింది అన్న విషయాన్ని స్పష్టంగా రుజువు చేసింది.

## ఐ బొమ్మ రవిని మేమే పట్టుకున్నాం

హైదరాబాద్,ఐబొమ్మ రవి కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. కీలక సమాచారాన్ని రాబడుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం ఐబొమ్మ రవి కేసుపై సీసీఎస్ అడిషినల్ సీపీ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రవికి బెట్టింగ్, గేమింగ్ యాప్స్ ద్వారా డబ్బులు వచ్చేవని అన్నారు. యాడ్ బుల్ కంపెనీ రవికి చెందినదేనని తెలిపారు. యాడ్స్ ద్వారా వచ్చిన డబ్బుల్ని యాడ్ బుల్ కంపెనీకి మళ్లించారని చెప్పారు. ఇమంది రవి ఇప్పటి వరకు 20 కోట్ల రూపాయల వరకు సంపాదించాడని వెల్లడించారు. . 'ఐబొమ్మ, బప్పం సైట్లను రవి స్నేహితుడు నిఖిల్ డిజైన్ చేశాడు. ఐబొమ్మ రవి ఓవర్ కాన్ఫిడెన్స్‌తోనే దొరికాడు. రవి భార్య మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. మరికొన్ని పైరసీ వెబ్‌సైట్లు నడుస్తూనే ఉన్నాయి. మూవీరూల్జ్, తమిళ్‌ఎంవీ లాంటి పైరసీ సైట్లు ఇంకా నడుస్తున్నాయి. పైరసీ సైట్ల నిర్వాహకులను పట్టుకునే పనిలోనే ఉన్నాం. ఐబొమ్మ పాపులర్ అయ్యాక.. దానిపేరును చాలామంది వాడుకుంటున్నారు. సినిమా సమీక్షలకు కూడా ఐబొమ్మ సైట్ పేరు వాడుకుంటున్నారు. భవిష్యత్‌లో వెబ్-3 టెక్నాలజీ కూడా రాబోతుంది. వెబ్-3 టెక్నాలజీతో పైరసీ చేస్తే పట్టుకోవడం కష్టం' అని అన్నారు. కాగా, నిన్న(సోమవారం) సాయంత్రంతో ఐబొమ్మ రవి కస్టడీ ముగిసింది. చివరి రోజు కస్టడీలో అధికారులు 3 గంటల పాటు అతడ్ని విచారించారు. విచారణలో రవి నుంచి పోలీసులు ఎలాంటి సమాధానాలు రాబట్టలేకపోయారని తెలుస్తోంది.

# సింధ్ భారత్‌దే.. త్వరలోనే హద్దులు చెరిగిపోతాయ్!



న్యూఢిల్లీ, జనగణమన అధినాయక జయహే అంటూ నిత్యం జాతీయ గీతం పాడతాం. ఇందులో పంజాబ్ సింధ్, గుజరాత్, మరాఠా అని పలుకుతాం. కానీ ఇందులో సింధ్ మన దేశంలో లేదు. రవీంద్రనాథ్ ఠాకూర్ జాతీయ గీతం రాసిన సమయంలో భారత్‌లో అంతర్భాగంగా ఉన్న సింధ్.. ఇప్పుడు భౌగోళికంగా పాకిస్తాన్‌లో ఉంది. కానీ సాంస్కృతికంగా ఇప్పటికీ సింధ్ భారత్‌దే. ఇదే విషయాన్ని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ ఇటీవల ఒక సింధ్ సాహిత్య సదస్సులో స్పష్టం చేశారు.

సాంస్కృతికంగా సింధ్ మనదే..

సింధ్ ప్రాంతం భౌగోళికంగా పాకిస్తాన్‌లో ఉండి వున్నప్పటికీ, జీవన విధానాలు, సాంస్కృతిక అనుబంధాలు భారత్‌తోనే ఉన్నాయని, అనేక మంది సింధ్ ప్రజలు భారతీయులుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో సింధ్‌ను భారత్‌లో కలుపకూడదా అన్న ఆలోచనలకు పునాదిగా రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలు ఉన్నాయి.

సింధ్ చరిత్ర..

సింధ్ 1936లో బ్రిటిష్ భారతదేశం నుంచి వేరుగా బాంబే ప్రెసిడెన్సీ నుంచి విడదీయబడింది. 1947లో కేవలం ఓ ఓటుతో పాకిస్తాన్‌లో కలిసింది. అప్పటి అసెంబ్లీ స్పీకర్ జీఎం సయ్యిద్ తప్పు జరిగినట్లు అంగీకరించారు. ప్రస్తుతం సింధ్ ప్రజలు పాకిస్తాన్‌లో వేధింపులకు గురవుతున్, స్వాతంత్ర్యం కోరుకుంటున్నారు.

11 ఏళ్లలోనే పాకిస్తాన్‌లో వలీనం..

1936లో భారత్ నుంచి విపోయిన సింధ్ 1947లో పాకిస్తాన్‌లో కలిసింది. కేవలం భారత్ నుంచి విడిపోయిన 11 ఏళ్లలోనే సింధ్ పాకిస్తాన్‌లో కలిసింది. ఇప్పుడు ఎందుకు కలిశామా అని దశాబ్దాలుగా బాధపడుతోంది. కేవలం ముస్లింల ఆధిపత్యం కారణంగానే సింధ్ పాకిస్తాన్‌లో కలిసింది. దీంతో సింధ్‌లోని హిందువులు భారత్‌కు వచ్చారు. అయినా అక్కడి వారు పాకిస్తాన్‌లో కలవడం తప్పు అని భావిస్తున్నారు.

పాకిస్తాన్ అంతర్గత విభేదాలు..

పాకిస్తాన్‌లో సింధ్‌తోపాటు బలూచిస్తాన్, ఖైబర్‌ఫఖ్తూన్ ప్రాంతాల్లో కూడా వేర్పాటు ఉద్యమాలు కొనసాగుతున్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా లేనిది, స్థానికులు వివక్షపై ఆందోళనలు చేస్తున్నారు. రాజనాథ్ సింగ్ సింధ్ పేరు ఎత్తడంతో పాకిస్తాన్ దీర్ఘకాల రాజకీయ, భౌగోళిక విలువలకు సవాల్ విసురుతున్నారని, సింధ్ భారతంతో కలిసే రోజులు దగ్గరగా ఉన్నాయని భావిస్తున్నారు. ఇది పాకిస్తాన్ వ్యతిరేక రాజకీయ వాతావరణాన్ని పెంపొందించడంతోపాటు భారత్ ఆర్థిక, సాంస్కృతిక తదితర దిశలో సింధ్ పునర్నిర్మాణానికి సందేశం.

# నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో హడావిడి



నిజామాబాద్, ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో హడావిడి మొదలయ్యింది. ప్రధాన ప్రతిపక్షం ఇందుకు వ్యూహాలు పన్నుతోంది. అలాగే అధికార కాంగ్రెస్ పట్టుకోసం ప్రయత్నిస్తోంది. బిజెపి కూడా తన పట్టును నిలుపుకునేందుకు సిద్దంగా ఉంది. మంత్రి వేముల ప్రశాంత రెడ్డి ఇప్పటికే కార్యక్షేత్రంలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి ప్రభుత్వ సలహాదరు సుదర్శన్ రెడ్డి, మరో సలహాదరు షబ్బీర్ అలీలకు ఇద పరీక్ష. ఇక బిజెపి ఎంపి అరవింద్ కూడా తమ పార్టీ కోసం ఎమ్మెల్యేలను కలుపుకుని ముందుకు సాగనున్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ నిర్వహించ నుండడంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. గంట విరామం తర్వాత మధ్యాహ్న 2గంటల నుంచి కౌంటింగ్ పక్రియ షురూ అవుతుంది. గతంలోనే ఓ మారు నోటిఫికేషన్ రావడంతో అప్పటికే అధికారులు సిద్దంగా ఉన్నారు. ఇప్పుడు అదే విధానంతో ముందుకు సాగనున్నారు. నిజామాబాద్ జిల్లాలో 545 పంచాయితీలు, 5022 వార్డులు ఉన్నాయి. కామారెడ్డి జిల్లాలో 532పంచాయితీలు, 4656 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. తొలి విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం బుదవారం మొదలు అయ్యింది. రెండో విడత నవంబర్ 30న, 3వ విడత నామినేషన్ల పర్వం డిసెంబర్ 3న ప్రారంభం కానుంది. తొలి విడతకు, రెండో విడతకు మధ్య రెండు రోజుల సమయం ఉంటుంది. రెండో విడతకు మూడో విడతకు మధ్య కూడా రెండు రోజుల సమయాన్ని ఇచ్చింది. నామినేషన్ల పక్రియ ప్రారంభం నుంచి పోలింగ్, కౌంటింగ్ ముగింపునకు మధ్య 14 రోజుల సమయాన్ని ఎన్నికల సంఘం ఇచ్చింది. నిజామాబాద్ జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్లు ఉండగా మూడు విడతల్లో ఒక్కో విడుత ఎన్నికల్లో చేర్చారు. మొదటి విడుతలో బోధన్ డివిజన్ పరిధిలో బోధన్, చందూర్, కోటగిరి, మోస్రా, పొతంగల్, రెంజల్, రుద్రూర్, సాలూర, వర్ని, ఎడపల్లి, నవీపేట మండలాలున్నాయి. రెండో విడతలో నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ధర్పల్లి, డిచ్‌పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాలు పేర్కొన్నారు. మూడో విడుతలో ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆర్మూర్, ఆలూర్, బాల్కొండ, భీంగల్, డొంకేశ్వర్, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట, వేల్పూర్, ఏర్గట్ల మండలాలున్నాయి. కామారెడ్డి జిల్లాలో మొత్తం మూడు రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. ఇందులో మొదటి విడుతలో కామారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని భిక్కనూర్, బీబీపేట, దోమకొండ, కామారెడ్డి, మాచారెడ్డి, పాల్వంచ, రాజంపేట, రామారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి మండలాలకు పోలిం గ్ ఉంటుంది. రెండో విడుతలో బాన్సువాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని లింగంపేట, నాగిరెడ్డిపేట, గాం ధారి, ఎల్లారెడ్డి, మహ్మద్‌నగర్, నిజాంసాగర్, పిట్లం మండలాలకు ఎన్నికలు ఉంటాయి. మూడో విడుతలో ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్ పరిధిలోని బాన్సువాడ, బిచ్కుంద, బీర్కూర్, డోంగ్లి, జుక్కల్, మద్నూర్, నస్రుల్లాబాద్, పెద్దకొడప్‌గల్ మండలాలు ఉన్నాయి.

# కవిత టార్గెట్ ఏంటి! జాగృతిలోకి రమ్మని బెదిరిస్తుందా?

హైదరాబాద్,బీఆర్ఎస్ నుంచి వేరుపడ్డ తర్వాత కల్వకుంట్ల కవిత సొంతంగా తనకంటూ ఒక మార్క్ ఉందని నిరూపించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.. ఇందుకోసం ఇప్పటికే జాగృతి సంస్థ నుంచి అనేక కార్యక్రమాలు చేస్తున్నారు.. అలాగే జాగృతి జనం బాట పేరుతో యాత్ర మొదలుపెట్టి తెలంగాణాలోని అన్ని నియోజకవర్గాలను చుట్టివచ్చేలా ఇప్పటికే ప్రణాళికలు రూపొందించుకున్నారు.. ఇప్పటికే పలు జిల్లాల్లో పర్యటించిన కవిత ఆయా జిల్లాల్లో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలను టార్గెట్ చేస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.. అసలు ఇంతకీ కవిత చేసిన వ్యాఖ్యలేంటి? ఆమె అజెండా ఏంటి?

బీఆర్ఎస్ నేతలపై జాగృతి అధ్యక్షురాలి విమర్శలు

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయి ఆ పార్టీ నేతలను టార్గెట్ చేస్తూ జాగృతి అధ్యక్షురాలు కల్వంకుంట్ల కవిత విమర్శలు చేస్తూనే వస్తున్నారు. జాగృతి జనం బాట యాత్రలో భాగంగా ఏ జిల్లాకు వెళ్తే అక్కడ ఉన్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలపై ప్రత్యక్షంగానే కామెంట్స్ చేస్తున్నారు.. వరంగల్ యాత్రలో హరీష్‌రావుపై, నిజామాబాద్ పర్యటనలో జీవన్ రెడ్డి, షకీల్‌పై, నల్గొండలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డిపై ఆమె పలుమార్లు విమర్శనాస్త్రాలు సంధిస్తూ, ఒక రేంజ్లో టార్గెట్ చేస్తున్నారు.. ఇప్పుడు తాజాగా మహబూబ్ నగర్ పర్యటనలో భాగంగా వనపర్తిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు జాగృతి అధ్యక్షురాలు

కృష్ణా నది కబ్జా చేసి ఫాంహౌజ్ కట్టున్నారని మండిపాటు

వనపర్తిలో నిరంజన్ రెడ్డి ఘోరాతి ఘోరంగా అరాచకాలకు పాల్పడుతున్నాడని, ఒక్క ఎకరానికి కూడా నీరు తీసుకురాని ఆయన నీళ్ల నిరంజన్ రెడ్డి అని పేరు ఎందుకు పెట్టుకున్నాడని ఎద్దేవా చేశారు కవిత.. నిరంజన్ రెడ్డి కృష్ణా నది కబ్జా చేసి ఫాంహౌజ్ కట్టుకుంటే ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి తనపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని ఇక నుంచి ఎలాంటి వ్యాఖ్యలు చేసినా సహించేది లేదంటూ కవిత హెచ్చరించారు..

పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చలేచిపోతుంది.. కవిత సీరియస్‌గా వార్నింగ్

నిరంజన్ రెడ్డి అరాచకాలను చిన్నపిల్లాడిని అడిగినా చెప్తాడని, తన తండ్రి వయసు ఉన్నవాడని ఇప్పటి వరకు గౌరవిస్తూ వచ్చానని.. మితిమీరి ప్రవర్తించి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే పుచ్చలేచిపోతుందని అంటూ కాస్త సీరియస్ గానే



వార్నింగ్ ఇచ్చారు కవిత.. ఇలాగే ఉంటే మహబూబ్ నగర్ జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ బతికి బట్టకట్టలేదని, మునుపు ఓడినదానికంటే ఇంకా ఎక్కువ మెజారిటీతో ప్రజలే బీఆర్ఎస్ పార్టీని ఓడిస్తారని వ్యంగ్యంగా చెప్పుకొచ్చారు కవిత..

మాజీ మంత్రుల అరాచకాలు కేసీఆర్‌కి తెలియవంటున్న కవిత

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హరీష్ రావ్ మనిషి కాబట్టే సీఎం రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవట్లేదని, ఇలా అవినీతిని ఎంకరేజ్ చేస్తే తెలంగాణా బాగుపడుతుందా అంటూ ప్రశ్నించారు.. తాను చేసిన విమర్శలకు సమాధానం చెప్పకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదంటూ తెగేసి చెప్పారు కవిత. అయితే నిరంజన్ రెడ్డితో పాటు ఇతర మాజీ మంత్రులు చేసిన అవినీతి బాగోతాలు కేసీఆర్ కి తెలియవని ఆయనకు తెలియజేసేందుకే తాను ఈ సమావేశం ఏర్పాటుచేశానంటూ చెప్పుకొచ్చారు కవిత..

కవితకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన నిరంజన్‌రెడ్డి

ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలకు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. కవిత ఎవరిని సంతోషపెట్టాలని చూస్తోందో తెలియదన్నారు. తాను కక్ష పూరితంగా ఎవరి మీద కేసులు పెట్టించలేదన్నారు. ఒక వేళ అలా ఏమైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. తప్పుడు ఆరోపణలు చేయవద్దని కవితకు సూచించారు. తండ్రి వయస్సు ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలను ఇంటికి పిలిపించుకుని మాట్లాడుతున్నావంటూ నిప్పులు చెరిగారు. నీళ్ల నిరంజన్ రెడ్డి అని తాను కావాలని పిలిపించుకోలేదని.. నీవే లిక్కర్ రాణి అని

# ద్రౌపది ముర్ము రాకతో చారిత్రాత్మక పరిణామం



న్యూఢిల్లీ,భారత దేశానికి అత్యంత గౌరవనీయమైన పదవి రాజ్యాంగం ప్రకారం అత్యున్నత మైన హోదా కలిగిన రాష్ట్రపతి పదవి ద్రౌపది ముర్ము చేపట్టారు. ఆమె 2022 జూలైలో ఈ పదవిని అందుకున్నారు. ఆమె అంతకు ముందు కీలక పదవులే చేశారు. ఆమె గవర్నర్ గా కొంతకాలం ఉన్నారు. దాని కంటే ముందు ఆమె రెండు సార్లు ఎమ్మెల్యేగా మంత్రిగా కూడా ఒడిశా ప్రభుత్వంలో పనిచేశారు. నిరాడంబరతకు మారు పేరు అయిన ద్రౌపది ముర్ము దేశానికే రాష్ట్రపతి కావడం అన్నది ఆమెకు దక్కిన ఒక అరుదైన గౌరవంగా చెబుతారు.

అది ఒక రికార్డు :

ఇదిలా ఉంటే తాను ఎక్కడైతే రాజకీయ ప్రస్థానం ప్రారంభించారో అక్కడికి దేశాధ్యక్షురాలి హోదాలో ద్రౌపది ముర్ము వస్తున్నారు. అక్కడ ఆమె రాకతో ఒక చారిత్రాత్మకమైన సందర్భంగా నమోదు అవుతుంది ఇంతకీ ఏమిటి అన్నది చూస్తే ఆసక్తికరమే. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒడిశా శాసనసభ శీతాకాల సమావేశాల మొదటి రోజైన గురువారం ఆ రాష్ట్ర అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. దేశ రాష్ట్రపతి హోదాలో ఇప్పటిదాకా ఎవరూ ఒడిశా అసెంబ్లీలో ప్రసగించలేదు. దాంతో ద్రౌపది ముర్ము ఈ విషయంలో ఒక రికార్డుని నమోదు చేస్తున్నారు.

నెగ్గిన చోట నుంచే :

అదే విధంగా ఒడిశా ఎమ్మెల్యేగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ద్రౌపది ముర్ము అదే సభలో రాష్ట్రపతి గా ప్రసంగం చేయడం చారిత్రాత్మక పరిణామంగా అంతా పేర్కొంటున్నారు. ఇలా ఎపుడూ ఎవరికీ ఈ చాన్స్ అయితే దక్కలేదు కానీ దానిని ద్రౌపది ముర్ము చేసి చూపిస్తున్నారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు శాసన సభలోని సభ్యులను ఉద్దేశించి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

అది ఆమెకు అపురూపం :

ఇక ఇదే పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాను శాసనసభ్యురాలిగా ఉన్న కాలంలో పనిచేసిన గది నంబర్ 11 ని స్వయంగా సందర్శిస్తారు. ద్రౌపది ముర్ము 2000 2004లో ఒడిశాలోని రాయరంగ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుండి రెండుసార్లు ఒడిశా శాసనసభకు ఎన్నికయ్యారు. ఆమె బిజెడి-బిజెపి సంకీర్ణ ప్రభుత్వంలో కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. దాంతో ఆమె ఎమ్మెల్యేగా తనకు ప్రభుత్వం కేటాయించిన గది నుంచే తన విధి నిర్వహణ చేపట్టారు. ఇపుడు ఆమె అత్యున్నత హోదాలో ఆ గదిని తిరిగి సందర్శిస్తున్నారు. అలా ఆమెకు మరో మధురమైన జ్ఞాపకంగా ఉండబోతోంది అని అంటున్నారు. మొత్తానికి ద్రౌపది ముర్ము పర్యటన కోసం సర్వం సిద్ధమై ఆమె రాక కోసం ఒడిశా అంతా వేయి కళ్ళతో ఎదురుచూస్తోంది.

# అమరావతి రైతుల సమస్యలపై పలాయనవాదం



గుంటూరు : రాజధాని నిర్మాణానికి తాము ఇచ్చిన భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ తమను పట్టించుకోవడం లేదని అమరావతి రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ నిర్లక్ష్యంపై ఎవరైనా ప్రస్తావిస్తే వారిపై అసత్య ప్రచారం చేస్తున్నారని వాపోతున్నారు. రెండు శాతం మంది రైతులు వారికి అనువైన ప్రాంతంలో రిటర్నబుల్ ప్లాట్లు దక్కలేదన్న భావనతో వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, 98 శాతం మందికి ఎటువంటి సమస్యలూ లేవని సిఆర్‌డిఎ అధికారులు మంత్రులకు, ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రభుత్వాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పల్లవిని ఎత్తుకొని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ కేవలం రెండు శాతం మందికే సమస్యలు ఉన్నాయని, మిగతా వారంతా సంతోషంగా ఉన్నారని ప్రకటించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెలకు ఒక్కసారి కూడా రైతులతో మంత్రులు, నాయకులు చర్చించిన దాఖలాలు లేవు. ఇటీవల గుంటూరులో రాజధాని రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బహిరంగంగా మీడియా ముందుకు వచ్చి సిఆర్‌డిఎ అధికారుల వైఖరిని తూర్పారబట్టారు. దీంతో, ప్రభుత్వంలో కొంత కదలిక వచ్చింది. కానీ, రెండు శాతం మంది రైతులే అసంతృప్తితో ఉన్నారని మంత్రులు, సిఆర్‌డిఎ అధికారులు చెప్పడంపై భూ సమీకరణలో భూములు ఇచ్చిన మెజార్టీ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజధాని అమరావతి విషయమై భవిష్యత్తులో ఎటువంటి మార్పులకూ అవకాశం లేకుండా పార్లమెంటులో చట్టబద్ధత, సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న మూడు రాజధానుల కేసు, జోన్ల కేటాయింపులో ఆర్-5 జోన్ కేసు ఉపసంహరణపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఆర్-5 జోన్ పరిధిలో 29 రాజధాని గ్రామాల్లో స్థానికులకు మాత్రమే ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని అమరావతి వాసులు కోరుతున్నారు. సమీకరణకు ఇవ్వని భూముల్లో కొందరి రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు వివాదస్పదమైంది. ఈ సమస్యను సిఆర్‌డిఎ అధికారులు పరిష్కరించడం లేదు. రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపులో లోపాలను సరిచేయాలని ఏళ్ల తరబడి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడేళ్లలో అప్పగిస్తామని సిఆర్‌డిఎ చట్టంలో పేర్కొన్నా పదేళ్లు దాటినా అమలు కాలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా అభివృద్ధి చేసిన ప్లాట్ల అప్పగింతలో జాప్యం జరుగుతోందని రైతులు చెబుతున్నారు. దాదాపు వెయ్యి మంది రైతులకు సాంకేతిక కారణాలతో ఆగిపోయిన వార్షిక కౌలు బకాయిలను ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. గ్రామ కంఠాల సమస్య పరిష్కారంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజధానిలోని బోరుపాలెం ప్రాంతంలో సమీకరణలో భూములు తీసుకునేటప్పుడు జరీబు భూములు అని చెప్పి కౌలు చెల్లింపులో మెట్ట భూములుగా నమోదు చేయడంపై ఆ గ్రామ రైతులు అభ్యంతరం చెబుతున్నారు. తమకు రిటర్నబుల్ ప్లాట్లలో కూడా అన్యాయం జరిగిందంటున్నారు. రాజధానిలో ఇల్లులేని పేదలకు నిర్మించిన టిడ్కో ఇళ్లకు బ్యాంకు రుణాల బకాయిలు తడిసి మోపెడయ్యాయి. బ్యాంకు రుణాన్ని ప్రభుత్వమే చెల్లించి తమను విముక్తులను చేయాలని పేదలు కోరుతున్నారు. రాజధాని ప్రాంతంలోని తుళ్లూరు, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగక 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. ఎన్నికల నిర్వహణపై ఇంతవరకు టిడిపి కూటమి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదు. రాజధాని అమరావతికి ఇప్పటి వరకు శాశ్వత ప్రాతిపదికన పిన్‌కోడ్, ఎస్‌టిడి కోడ్, ఐఎస్‌డి లేవు. కార్పొరేట్ సంస్థలకు కేటాయించిన భూముల్లో ఆయా సంస్థల ఏర్పాటుపై అధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తుండడంతో భూములు బీడుగా మారడం తప్ప, ప్రయోజనం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆరు నెలల క్రితం కలిసి విన్నవించామని, ఇవి నేటికీ పరిష్కారం కాలేదని, మరోసారి ఆయనను కలిసేందుకు అపాయింట్‌మెంట్ దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పల్లె పండుగ 2.0:.. అంతా పవన్ మేనియా

అమరావతి, ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లె స్వరూపాలు మారాయి. వైయస్సార్ కాంగ్రెస్ ఐదేళ్ల కాలం సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మౌలిక వసతుల కల్పన అనేది జరగని పనిగా మారింది. అందుకే కూటమి అధికారంలోకి వచ్చిన మౌలిక సౌకర్యాలపై దృష్టి పెట్టింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వద్ద పంచాయితీరాజ్ తో పాటు గ్రామీణ అభివృద్ధి శాఖ ఉంది. గతంలో పల్లెలకు వచ్చిన ఆర్థిక సంఘం నిధులతో పాటు ప్రత్యేక నిధులను మళ్లించేవారు. పవన్ దానికి ఒప్పుకోకుండా పల్లె పండుగ పేరిట రోడ్లతోపాటు కాలువల నిర్మాణం చేపట్టారు. దీంతో పల్లెలు ఒక స్వరూపం మార్చుకున్నాయి. ఇప్పుడు పల్లె పండుగ 2.0 ను ప్రారంభించారు పవన్ కళ్యాణ్. రాజోలు నియోజకవర్గం శివకోడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వచ్చే సంక్రాంతి నాటికి పల్లెల్లో మరిన్ని పనులు జరగనున్నాయి అన్నమాట.

ముగ్గురిదీ ఒక్కో బాధ్యత..

కూటమి పెద్దల పనితీరు గమనిస్తే ఒక్కొక్కరిది ఒక్కో బాధ్యత. విదేశీ పెట్టుబడులతో పాటు పెద్ద ఎత్తున పరిశ్రమలను తీసుకువచ్చే బాధ్యత మంత్రి నారా లోకేష్ తీసుకున్నారు. సీఎం చంద్రబాబు పాలనపై పూర్తి దృష్టి పెట్టారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటున్నారు. పవన్ విషయానికి వచ్చేసరికి పూర్తిగా గ్రామీణ అభివృద్ధి పైనే తన ఫోకస్ పెట్టారు. మరోవైపు రాజకీయంగా కూటమికి కష్టం వచ్చినప్పుడు ముందుకు వస్తున్నారు పవన్. కీలక ప్రకటనలు చేస్తున్నారు. రాజకీయ ప్రత్యర్థులకు గట్టి హెచ్చరికలు పంపుతున్నారు. అయితే ఈ ముగ్గురు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంటగింపుగా మారారు




అనడం అతిశయోక్తి కాదు. అయితే పల్లె పండుగ 2.0 తో పల్లెల స్వరూపమే మారిపోతుందని కూటమి ప్రభుత్వం అంచనా వేస్తోంది.లి గత ఏడాది జరిగిన తొలి పల్లె పండుగలో నాలుగు వేల కిలోమీటర్ల రోడ్లను నిర్మించారు. ఇప్పుడు దానికి రెట్టింపు రోడ్లు వేయాలని భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 13326 గ్రామపంచాయతీల పరిధిలో రూ.6787 కోట్ల వ్యయంతో 53,382 అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.లి పల్లె పండుగ 2.0 లో ఇప్పటికే 4000 కిలోమీటర్ల సిసి రహదారులు నిర్మించారు. పాడి రైతుల కోసం 22,500 మినీ గోకులాలు ఏర్పాటు చేశారు. కొత్తగా 8571 కిలోమీటర్ల కొత్త రహదారులు నిర్మిస్తున్నారు. పాత రహదారుల స్థానంలో పునర్నిర్మాణం చేపడుతున్నారు. 58 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం కూడా చేపడుతున్నారు.

# న్యూఢిల్లీలో 'చాలా పేలవమైన' గాలి నాణ్యత



న్యూఢిల్లీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో గురువారం ఉదయం గాలి నాణ్యత 'చాలా పేలవమైన' విభాగంలో నమోదైంది. ఎక్యూఐ రీడింగ్ 355 గా నమోదు అయింది. దీంతో ఈ స్థాయిని 'చాలా పేలవంగా' కేటగిరీలోనే ఉందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. గత 13 రోజులుగా నగరం పేలవమైన గాలి నాణ్యతతో ప్రజలు ఇబ్బందులకు గురౌతున్నారు. కనిష్ట ఉష్ణోగ్రత 8.3 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరపడింది. ఇది సీజన్ సగటు కంటే 2 డిగ్రీలు తక్కువగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ చుట్టూ ఉండే అవకాశం ఉంది. గురువారం ప్రధానంగా ఆకాశం స్పష్టంగా ఉంటుందని, శుక్రవారం, శనివారం మరియు ఆదివారం నిస్సారమైన నుండి మితమైన పొగమంచు ఉంటుందని భారత వాతావరణ శాఖ(ఐఎండి) అంచనా వేసింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com